జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



ప్రజాపాలన

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?

మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది


వివరాలకు సంప్రదించండి 8886022523



సంపుటి 7 సంచిక 70 | హైదరాబాద్, మే 26 శుక్రవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00


## పండుగలా... నిర్వహిద్దాం...

### తెలంగాణ ఖ్యాతిని చాటుదాం



- ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోండి
- గ్రామ స్థాయి నుంచి కార్యక్రమాలు చేయండి
- దశాబ్ది ఉత్సవాల ఖర్చుల కోసం రూ. 105 కోట్లు
- కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్ : ఆరు దశాబ్దాల పాటు కొనసాగిన పోరాటాలు, త్యాగాల ఫలితంగా పార్లమెంట్ ప్రజాస్వామ్య పంథాలో సాధించుకున్న తెలంగాణ స్వరాష్ట్రంలో.. అనతి కాలంలోనే దేశం గర్వించేలా పదేళ్లకు చేరుకున్న తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని.. అమరుల త్యాగాలు గుర్తు చేసుకుంటూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ ఘనకీర్తిని చాటిచెప్పేలా.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు, పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కార్యచరణపై దిశానిర్దేశం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం కొనసాగుతోంది. మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ముఖ్యమంత్రి సలహాదారులు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, సీఎంవో కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు, డీజీపీ, జిల్లా ఎస్పీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రోజు వారి కార్యక్రమాల గురించి, ఏరోజుకు ఏ కార్యక్రమం చేపట్టాలో కలెక్టర్లకు సీఎం సూచించారు. గ్రామాలు, నియోజకవర్గ, జిల్లాల వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి కేసీఆర్ వివరించారు. మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్లకు సీఎం దిశా నిర్దేశం చేశారు. దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన ఖర్చులకు గానూ కలెక్టర్లకు రూ. 105 కోట్ల నిధులు విడుదల చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అధ్యక్షతన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రారంభమైన జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్. ఈ కాన్ఫరెన్స్ లో మంత్రులు, ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టీఎస్ ఎంసెట్ ఫలితాలలో ఏపీదే హవా..




హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్ ఫలితాలు విడులయ్యాయి. అగ్రికల్చర్‌లో 86 శాతం, ఇంజినీరింగ్ విభాగంలో 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో అధికారులతో కలిసి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫలితాలను విడుదల చేశారు. అగ్రికల్చర్ విభాగంలో 84 శాతం బాలురు, 87 శాతం మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. ఇక ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో బాలురు 79 శాతం, బాలికలు 82 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ లో చూడవచ్చు. అడ్మిషన్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను త్వరలో విడుదలచేస్తామని మంత్రి చెప్పారు. ఎంసెట్ పరీక్షలను ఈ నెల 10 నుంచి 14 వరకు నిర్వహించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌కు 94.11 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంజినీరింగ్ పరీక్షకు 2,05,405 మంది దరఖాస్తు చేసుకోగా 1,95,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక అగ్రికల్చర్, మెడికల్ పరీక్షలకు 1,15,361 మంది అప్లయ్ చేసుకోగా 1,06,514 మంది విద్యార్థులు హాజరయ్యారు.


ఇంజినీరింగ్ టాప్ టెన్ ర్యాంకర్లు వీరే..

సనపాల అనిరుధ్(విశాఖపట్టణం) తొలి ర్యాంకు సాధించగా, మణింధర్ రెడ్డి(గుంటూరు) రెండో ర్యాంకు, ఉమేశ్ వరుణ్(నందిగామ) మూడో ర్యాంకు, అభిణిత్ మజేటి(హైదరాబాద్) నాలుగో ర్యాంకు, ప్రమోద్ కుమార్ రెడ్డి(తాడిపత్రి) ఐదో ర్యాంకు, మారదన ధీరజ్(విశాఖపట్టణం) ఆరో ర్యాంకు, వడ్డే శాన్విత(నల్లగొండ) ఏడో ర్యాంకు, బోయిన సంజన(శ్రీకాకుళం) ఎనిమిదో ర్యాంకు, నంద్యాల ప్రిన్స్ బ్రనహం రెడ్డి(నంద్యాల) తొమ్మిదో ర్యాంకు, మీసాల ప్రణతి శ్రీజ(విజయనగరం) పదో ర్యాంకు సాధించారు.

అగ్రికల్చర్, మెడిసిన్ టాప్ టెన్ ర్యాంకర్లు వీరే..

తొలి ర్యాంకు – బూరుగుపల్లి సత్య రాజ జశ్వంత్(ఈస్ట్ గోదావరి), రెండో ర్యాంకు – నశిక వెంకట తేజ(చీరాల),మూడో ర్యాంకు – సఫల్ లక్ష్మీ పసుపులేటి(రంగారెడ్డి), నాలుగో ర్యాంకు – దుర్గంపూడి కార్తీకేయ రెడ్డి(గుంటూరు),ఐదో ర్యాంకు – బోర వరుణ్ చక్రవర్తి(శ్రీకాకుళం), ఆరో ర్యాంకు – దేవగుడి గురు శశిధర్ రెడ్డి(హైదరాబాద్),ఏడో ర్యాంకు – వంగీపురం హర్షిల్ సాయి(నెల్లూరు), ఎనిమిదో ర్యాంకు – దద్దనాల సాయి చిద్విలాస్ రెడ్డి(గుంటూరు),తొమ్మిదో ర్యాంకు – గంధమనేని గిరి వర్షిత(అనంతపురం),పదో ర్యాంకు – కోళ్లబత్తుల ప్రీతం సిద్ధార్థ్ (హైదరాబాద్)

## గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షపై స్టేకు హైకోర్టు నిరాకరణ



హైదరాబాద్ : గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షపై స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) జూన్ 11న నిర్వహించ తలపెట్టిన గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్‌పై ఇవాళ విచారణ జరిగింది. అయితే గురువారం ఉదయమే ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. తన కుమార్తె కూడా గ్రూప్ –1 ప్రిలిమ్స్ రాసినందున తాను విచారించలేనని జస్టిస్ కే లక్ష్మణ్ పేర్కొన్నారు. పిటిషన్‌ను మధ్యాహ్నం మరో బెంచ్‌కు పంపిస్తానని లక్ష్మణ్ వివరించారు. ఇవాళ మధ్యాహ్నం జస్టిస్ పుల్లా కార్తీక్ బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టి.. ప్రిలిమ్స్ పరీక్షపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. వివిధ పోస్టులకు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసినప్పుడు సంబంధిత పరీక్షల మధ్య 2 నెలల వ్యవధి ఉండాలన్న నిబంధనను అమలు చేయకుండా గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహణకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడం చట్టవిరుద్ధమని 36 మంది అభ్యర్థులు ఆ పిటిషన్‌లో పేరొన్నారు. దీనిపై వివరణ ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శి, హెూం శాఖ కార్యదర్శి, సిట్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది కోర్టు.

## మదర్ ఆఫ్ డెమోక్రసీలో ఎన్నో ప్రత్యేకతలు..



ఢిల్లీ:'మదర్ ఆఫ్ డెమోక్రసీ ప్రారంభానికి సిద్ధమైంది. మే 28వ తేదీన చారిత్రాత్మకంగా నిర్మించిన పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. అయితే ఈ కొత్త పార్లమెంట్ భవనానికి ఇంకా ఏ పేరును కేంద్రం ఖరారు చేయలేదు. దీంతో నూతన పార్లమెంట్ భవనానికి ఏ పేరు పెడతారు అన్న చర్చ మొదలైంది. అంతేకాకుండా కొత్తగా నిర్మించిన పార్లమెంట్?లో ఎన్ని ద్వారాలున్నాయి. ఆ ద్వారాలకు ఏ పేర్లు పెట్టారని ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

**ప్రముఖుల విగ్రహాలు..**

నూతన పార్లమెంట్ భవనం ఎన్నో ప్రత్యేకతలను కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త పార్లమెంట్ భవనంలో మహాత్మాగాంధీ, చాణిక్యుడు, సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తో సహా ప్రముఖుల విగ్రహాలు ఉంటాయని ఉంటాయని చెబుతున్నారు. అంతేకాకుండా కొత్త పార్లమెంట్ భవనానికి మూడు ప్రవేశ ద్వారాలు ఉన్నాయట. ఈ ప్రవేశ ద్వారాలకు చారిత్రక అంశాలను మేళవించారట. ఈ ప్రధాన ప్రవేశ ద్వారాలకు కూడా పేర్లు పెట్టారని తెలుస్తోంది.

**ప్రవేశ ద్వారాలకు ప్రత్యేక పేర్లు..**

కొత్త పార్లమెంట్ భవనంలో మూడు ప్రధాన ద్వారాలుంటాయి. వాటికి ప్రత్యేక పేర్లను పెట్టినట్లు తెలుస్తోంది. జ్ఞాన ద్వారం..శక్తి ద్వారం.. కర్మ ద్వారాలుగా నామకరణం చేశారు. జ్ఞాన ద్వారానికి ఒకవైపున గార్గి, యాజ్ఞవల్క్య మహర్షి మధ్య జరిగిన సంభాషణ దృశ్యం, మరోవైపు నలంద చిత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. శక్తి ద్వారానికి ఒక వైపున చాణిక్య, మరోవైపు మహాత్మాగాంధీ దండియాత్ర దృశ్యాలు ఉండనున్నాయి. కర్మ ద్వారానికి ఒకవైపు కోణార్క్ చక్రం, మరోవైపు సర్దార్ వల్లభాయ్ పటేల్, అంబేద్కర్ కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు.

## పేదల భూములను సర్కారు అమ్ముకుంటోంది: భట్టి



మహబూబ్ నగర్ : పాదయాత్ర చేపట్టానని అన్నారు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క. మే 25వ తేదీ మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీపై తప్పుడు కేసు పెట్టి ఇల్లు ఖాళీ చేపిస్తే.. కర్ణాటక ప్రజలు బీజేపీని రాష్ట్రం నుంచి ఖాళీ చేయించారని ఎద్దేవ చేశారు భట్టి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పోడు భూముల పట్టాలను ధరణి పోర్టల్ లో రికార్డు చేయటం లేదని ఆదిలాబాద్ అడవి బిడ్డలు ఆందోళన చెందుతున్నారని వ్యాఖ్యానించారు బట్టి. సింగరేణి ఆస్తులను కాపాడాలని బొగ్గు బావి కార్మికులు కోరారాయన. తల్లిదండ్రులు తమ బిడ్డలను అప్పులు చేసి కోచింగ్ సెంటర్లకు పంపి చదివిస్తే..ఈ ప్రభుత్వం పేపర్ లీక్ చేసి పరీక్షలను రద్దు చేసిందని భట్టి మండిపడ్డారు. రాష్ట్రంలో 24 లక్షల ఎకరాల పేదల భూములను సర్కారు అమ్ముకుంటోందని బట్టి విక్రమార్క ఆరోపించారు. పేదలకు ఇచ్చిన 5 లక్షల కోట్ల విలువైన ఇళ్ల పట్టాల సంపదనను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, బడా కంపెనీలకు ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తోందన్నారు.




## రైతే రాజు దేశానికి ఆదర్శం జడ్పీ చైర్మన్



మధిర రూరల్ మే 25 మున్సిపాలిటీ పరిధిలో స్థానిక మార్కెట్ యాడ్ లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధిలోదూసుకెళ్తూ దేశంలోనే రైతురాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని అనేక కేంద్రాలు ఏర్పాట్లు చేసిరైతులకు అండగాఉ టున్న ప్రభుత్వము అనివారు తెలిపారు ఈ కార్యక్రమంలోసొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణ ప్రసాద్ గుర్రంరం రామారావు రంగిశెట్టి కోటేశ్వరరావు అప్పారావు తో, టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తల పాల్గొన్నారు

## గ్రంథాలయ చెర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్




ఇబ్రహింపట్నం మే తేది25 ప్రజాపాలన ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా గ్రంథాలయం చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి నూతన గృహప్రవేశం వేడుకల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తో పాటు పాల్గొన్న బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ . ఈ కార్యక్రమం లో నోముల కృష్ణ గౌడ్, మాజీ సర్పంచ్ గణేష్, పాల్గొన్నారు.

## లోయపల్లి గ్రామంలో బొడ్రాయి పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఇబ్రహింపట్నం మే తేది 25 ప్రజాపాలన ప్రతినిధి మంచాల మండలం లోయపల్లి గ్రామంలో బొడ్రాయి పండుగ సందర్భంగా లోయపల్లి గ్రామానికి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఈ సి శేఖర్ గౌడ్ మామకు గ్రామస్తులు పార్టీ నాయకులు స్వాగతం పలికారు అనంతరం గ్రామంలో ప్రతిష్ఠించిన బొడ్రాయి కి ఈ సి శేఖర్ గౌడ్ ప్రత్యేక పూజలు చేసారు గ్రామంలో ని ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి అని ఈ సందర్భంగా ఆ దేవుని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో .వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడుమాదగోని జంగయ్య గౌడ్.బిసి సంఘం.ఇబ్రహీంపట్నం మండలం అధ్యక్షుడుపోకల్ కార్ హరి నారాయణ జి కాంగ్రెస్ పార్టీ నాయకులు.తల్లా పల్లి కృష్ణ.కొర్ర మోతి రాం నాయక్ .చెరుకు. సత్యనారాయణ గౌడ్బుర్ర బాలరాజు గౌడ్ .నాతి. చెంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ పరిధిలోనే వివాహ ధ్రువీకరణ పత్రాల అందజేత



మధిర రూరల్ మే 25 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో నక్కలగరువు గ్రామంలో బుచ్చిరెడ్డిపాలెంఇకపై గ్రామపంచాయతీల్లో వివాహ ,జనన,మరణ ధ్రువీకరణ పత్రాలు అందించటం జరుగుతుందని నక్కలగరుబు(బుచ్చిరెడ్డిపాలెం) పంచాయతీ కార్యదర్శి హేమలత అన్నారు. ఈ రోజు గ్రామానికి చెందిన జోనబోయిన గోపికృష్ణ-లావణ్య ల వివాహ ధ్రువీకరణ పత్రాన్ని గ్రామ సర్పంచ్ మునగా వెంకట్రావమ్మ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు ఇబ్బందిపడకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయాలలోనే వివాహ,జనన,మరణ ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించిందని అన్నారు. ఈ సేవలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎస్టీలకు అండగా కాంగ్రెస్ పార్టీ



మధిర మే 25 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీలకు అండగా ఉంటూ ఎస్సి ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని తుంగలో తొక్కిన సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ బ్యాక్ లాగ్ పోస్టులను కూడా భర్తీ చేసేలా కాంగ్రెస్ పార్టీ బాధ్యత తీసుకుంటుంది సూరంశెట్టి కిషోర్లి పేర్కొన్నారు మల్లు భట్టి విక్రమార్కలి ఆదేశాలతో మధిర మండలం వంగవీడు గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుడు లిశ్రీనివాస్ రెడ్డిలి ఆధ్వర్యంలో లిహాత్ సే హాత్ జోడోలి కార్యక్రమంనిర్వహించబడింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగవీడు గ్రామంలో రాహుల్ గాంధీ సందేశ కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంచుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టబోయే పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిసూరంశెట్టి కిషోర్లి మాట్లాడుతూబడ్జెట్ లో దళిత గిరిజనుల అభ్యున్నతికి భారీగా నిధులు కేటాయింపులు చేస్తున్నట్టు కాగితాల లెక్కలు చూపిస్తున్న ప్రభుత్వం ఆ నిధులను వారి కోసం ఖర్చు చేయకుండా దారి మళ్ళించి ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ చట్టానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం సబ్ ప్లాన్ కింద 1, 07, 319 కేటాయించి అందులో సగం కూడా దళిత గిరిజనులకు ఖర్చు చేయలేదని మండిపడ్డారు. ఇప్పటి వరకు దాదాపు తెలంగాణ ప్రభుత్వం 65 వేల కోట్లను దారి మళ్ళించి దళిత, గిరిజనుల మోసం చేసిందని అన్నారు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని తుంగలో తొక్కిన సీఎం కేసీఆర్ దళిత బంధు పథకం పేరిట డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయకుండా కేసీఆర్ నాటకాలు అడుతున్నాడు అన్నారు.కాంగ్రెస్ పార్టీ 2024 ఏడాదిలో తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు. మొదటి ఏడాదిలోనే ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ బ్యాక్ లాగ్ పోస్టులను కూడా భర్తీ చేసేలా కాంగ్రెస్ పార్టీ బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. రైతులకు, కౌలు రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, తెలంగాణలో పార్టీ అధికారంలోకి రాగానే వ్యవసాయ భూములున్న రైతులతో సమానంగా కౌలు రైతులకు అన్ని ప్రయోజనాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లిచావా వేణులి మధిర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లిఅద్దంకి రవికుమార్లి మండల బీసీ సెల్ అధ్యక్షుడు లిచిలువేరు బుచ్చిరామయ్యలి మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు లిదుంప వెంకటేశ్వర రెడ్డిలి మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు లిబాణావత్ వెంకటరమణ నాయక్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లిఐలూరి సత్యనారాయణ రెడ్డిలి లిఆదిమూలం శ్రీనివాసరావు మైలవరపు చక్రిలి గ్రామ కాంగ్రెస్ నాయకులు లిత్యాగం సుధాకర్ రెడ్డి, దర్శి కృష్ణ, భూక్య రాంబాబు, చెరుకూరి సురేష్, అయిలూరి విష్ణువర్ధన్ రెడ్డి, ఓబుల నాగిరెడ్డి, శీలం నాగిరెడ్డి, బూడిద రామకృష్ణ, చిట్టిపోగు ఏసురత్నం, షేక్ మహేష్లి మొదలవారు పాల్గొన్నారు..

## ఈనెల 27 తారీఖున నిరుద్యోగ మార్చ్ ను విజయవంతం చేయండి: బిజెపి పార్టీ



మధిర మే 25 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో గురువారం నాడు బీజేపీ అధ్యర్యంలో జరిగే నిరుద్యోగ మార్చ కు,నిరుద్యోగులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయాలిలి

భారతీయ జనత పార్టీ కార్యాలయంలో నిరుద్యోగ మార్చ్, గోడ పత్రికను ఆవిష్కరణ చేయటం జరిగింది,శనివారం, ఖమ్మం లో జరిగే, నిరుద్యోగ మార్చ కుప్రతి పోలింగ్ బూత్ నుండి, బూత్ అధ్యక్షులు, పార్టీలకు అతీతంగా నిరుద్యోగులు అందరికోసం జరుగుతున్నా ఈ కార్యక్రమానికి మీ పోలింగ్ బూత్ లో ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులు, యువకులను,27 న ఖమ్మం లో జరిగే నిరుద్యోగ మార్చ కు అధిక సంఖ్యలో తీసుకోని రావాలి అని పిలువునివ్వటం జరిగింది,ఈ కార్యక్రమం లో మధిర అసెంబ్లీ కన్వీనర్, లిఏలూరి నాగేశ్వరరావులి దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి, లిపెరుమాళ్ళపల్లి విజయరాజులి బీజేపీ జిల్లా కార్యదర్శి, లిచిలువేరు సాంబశివరావులి పట్టణ మరియు మండల అధ్యక్షులు,లిపాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డిలి జిల్లా కార్యవర్గ సభ్యులు లికుంచం కృష్ణారావు, మర్సకట్ల స్వర్ణాకర్లి యువ మోర్చా జిల్లా కార్యదర్శి లికాసినా నాగభూషణంలి అసెంబ్లీ మాన్ కి బాత్ ప్రముఖ, లికొప్పురావూరి రామ యోగేశ్వరరావులి దళిత మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు,లిగొల్లమందల గోపాలరావులి పట్టణ ప్రధాన కార్యదర్శి లిపగడాల నాగేంద్రబాబులి సీనియర్ నాయకులు లిబత్తినేని వెంకట నాగభూషణరావులి యువమోర్చ పట్టణ అధ్యక్షుడు లికుక్కల రాము పింజారి ఖాజామియా, రవిచంద్లి తదితరులు పాల్గొన్నారు,

## అసైన్డ్ ల్యాండ్ దారులకే ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలి: తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): 1977 పి ఓ టి చట్టంను రద్దు చేసి ఎస్ సి, ఎస్ టి, బీసీ అసైన్డ్ ల్యాండ్ దారులకే ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలన్నారు తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1977 చట్టం రద్దు వల్ల దాదాపు కోటి మందికి లబ్ది చేకూరుతుందన్నారు. అసైన్డ్ ల్యాండ్ ఓనర్ల కు చట్ట బద్ధత కల్పించాలన్నారు. పరిశ్రమలకు భూములు ఇస్తున్న సి ఎం, 16 లక్షల కుటుంబాలు వీధిన పడకుండా అసైన్డ్ భూములను తమకు ఇచ్చి చట్ట బద్ధత కల్పించాలన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే ఎన్నో పనులు చేస్తున్న ముఖ్యమంత్రి అసైన్డ్ భూములను కూడా ఓనర్లకు దక్కేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమం లో పేద ప్రజలు చాలా మంది పాల్గొన్నారని, భూ పోరాటం లో చాలా మంది అమరులయ్యారని, అణగారిన వర్గాల వారికే ఈ అసైన్డ్ భూముల హక్కు దారులుగా చేయాలన్నారు. 1977 చట్టం లో భూములపై అధికారాలు లేకుండా చేశారని అందుకే ఈ చట్టాన్ని రద్దు చేసి ల్యాండ్ దారులకే పూర్తి హక్కులు కల్పిస్తూ నూతన చట్టాన్ని తేవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని ఇప్పటికే ఈ అసైన్డ్ భూములు కల్గి ఉన్న వారికే భూములపై హక్కులు కల్పించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బింగి రాములు, రుద్రారం శంకర్, రాథోడ్,నర్సింగ్ రావు, సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా పడి ప్రమాదంలో గాయపడిన 22మంది కొత్తపల్లి గ్రామస్తులను పరామర్శించిన సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగాళ్ల భాస్కర్







ఇబ్రహింపట్నం మే తేది 25 ప్రజాపాలన ప్రతినిధి: కొత్తపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కూలీలు 22 మంది ఆదిభట్ల సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు పైన ఆటోలో ప్రయాణిస్తూ ఆటో ఫల్టి కొట్టడం వల్ల జరిగిన ప్రమాదంలో 22 మంది తీవ్ర గాయాలతో బి.యన్.రెడ్డి నగర్ లోని బృంగి హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు ఈ విషయం తెలుసుకొని సిపిఎం పార్టీ నాయకులు ప్రమాదంలో గాయపడిన వారిని పరిశీలించి వారి యొక్క పరిస్థితి వైద్య డాక్టర్ తో మాట్లాడి వారికి భరోసా కల్పించి వారి కుటుంబనికి ధైర్యం చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య,జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు కిషన్, సిపిఎం యాచారం మండల కార్యదర్శి ఆల్లంపల్లి నరసింహ,కొత్తపల్లి సర్పంచ్ ఎండి. హబీబ్, ఉపసర్పంచ్ కావలి జగన్, పెద్దాపురం నరసింహ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ టికెట్ నాకే: పట్నం మహేందర్ రెడ్డి

తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి రానున్న శాసనసభ ఎన్నికల్లో తనకే భారతీయ రాష్ట్ర సమితి టికెట్ వస్తుందని రానున్న ఎన్నికల్లో నాకు పోటీ ఉండాలని ఆయన ఎమ్మెల్సీ మాజీ శాసనసభ్యులు డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు తాండూర్ లో బుధవారం రోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవుల కోసం ఆశించే వారిని ఇతర వర్గంలోకి వెళ్ళమని తానే చెప్పానని ఆయన చెప్పారు తాండూర్లో పల్లె పల్లెకు పట్నం మహేందర్ రెడ్డి కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తున్న అన్ని ముఖ్యమంత్రి కేసీఆర్తో అనుమతి తీసుకున్నట్లు ఆయన తెలిపారు రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్ అధిక సీట్లను గెలుచుకొని శాసనసభలో అధికారంలో ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు .

## పేదల కళ్ళల్లో ఆనందం నింపడం కోసమే కంటి వెలుగు: జడ్పీ చైర్మన్



మధిర మే 25 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మడుపల్లి గ్రామం లో రెండవ విడత కంటి వెలుగు ప్రారంభోత్సవం లో జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కళ్ళల్లో ఆనందం నింపడం కోసమే కంటి వెలుగు పథకం ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్నట్లు జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు గురువారం నాడు మధిర పట్టన పరిధి లో మడుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రెండవ విడత కంటి వెలుగు పథకాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు అండగా నిలవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు అమలు చేస్తున్నట్లు తెలిపారు కంటి వెలుగు శిబిరం లో వైద్యులు అందుబాటులో ఉండి పరీక్షలు చేసిన అనంతరం వారికి అవసరమైన కంటి అద్దాలను అందించడం జరుగుతోందని పేర్కొన్నారు ప్రజలెవరు కంటి సమస్యల తో బాధపడవద్దనే లక్ష్యం తో కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలతో పాటుగా మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు వేలాది కుటుంబాలకు అండగా మారిన బృహత్తర పథకం కంటి వెలుగు అన్నారు ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ముందు చూపుతో పేద కుటుంబాలకు భరోసా కలుగుతుందని స్పష్టం చేశారు ఈ కంటి వెలుగు ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొండితోక లత వైస్ చైర్మన్ విద్యాలత వెంకట్ రెడ్డి విజయ లక్ష్మీ ఓంకార్ పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు

## ఎంసెట్ ర్యాంక్ సాధించిన మాటూర్ హై స్కూల్ పూర్వ విద్యార్థి సాధన రామకృష్ణ



మధిర రూరల్ మే 25 ప్రజాపాల ప్రతినిధి మండలం పరిధిలో విడుదలైన తెలంగాణ రాష్ట్ర ఎంసెట్ ఫలితాలలో మాటూరు హైస్కూల్ కు చెందిన పూర్వ విద్యార్థి లిసాదం రామకృష్ణ రాష్ట్రస్థాయిలో 237 ర్యాంకులి సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ దీవి సాయి కృష్ణమాచార్యులు తెలిపారు. టీఎస్ ఎంసెట్లో స్టేట్ ర్యాంకు సాధించిన రామకృష్ణకు మండల విద్యాశాఖ అధికారి శ్రీ వై ప్రభాకర్ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ జేఈఈ మెయిన్స్ లో 98.98 పర్స%శీ%టైల్ తో అడ్వాడ్ కు సెలెక్ట్ అయిన సాదం రామకృష్ణ టాప్ ఐఐటి కళాశాలలో సీటు సాధించాలని కోరారు. చిన్ననాటి నుంచి పూర్తిగా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి స్టేట్ ర్యాంకు సాధించిన రామకృష్ణకు మాటూరు మాటలు పేట గ్రామస్తులు, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## మంచిరెడ్డి పద్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ ఎంపీ బుర్ర నరసయ్య గౌడ్



ఇబ్రహింపట్నం మే తేది 25 ప్రజాపాలన ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాతృమూర్తి కీ??శే మంచిరెడ్డి పద్మమ్మ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎంపీ బూర నర్సయ్య .అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. పాల్గొన్న బిజెపి నాయకులు పొట్టి రాములు, శిఘ విరస్వామి గౌడ్, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్, సర్పంచ్ అశోక్ వర్ధన్ రెడ్డి, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జీతాలు చెల్లింపు



మేడిపల్లి, మే25 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు టీచర్లు సంధ్యారాణి, సన మరియు పారిశుద్ధ్య కార్మికురాలు నర్సమ్మకు బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ 80 వేల రూపాయలు జీతాలు మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో వారికి బండారి లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, మల్లాపూర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కటార్ల భాస్కర్, లంబు శ్రీను గౌడ్, శ్రీశైలం యాదవ్, ప్రభాకర్ రెడ్డి ఏ. పద్మా రెడ్డి, ఏ మన్యం గిరి, యాదవ్, శ్రావణ్, కల్వాల అంజి ,ముత్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

## దెందుకూరు సొసైటీ ద్వారా కూల్ వాటర్ క్యాన్ 20 రూపాయలకే



మధిర మే 25 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో దెందుకూరు సొసైటీ ద్వారా సొసైటీ అధ్యక్షులు కోట కృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ దెందుకూరు సొసైటీ ద్వారా గ్రామ ప్రజలకు మరియు పరిసర ప్రాంత ప్రజలకులి లితెలియంజేయంనదిలి లిఏమనగా దెందుకూరు సొసైటీ నందుకూలింగ్లి లివాటర్ క్యాన్ 20లి లిరూపాయలు కులి లిలభించును. శుభాకార్యాలకు మరియు అన్ని ఫంక్షన్లకుకుడాఇవ్వబడును. ఈ రోజు నుండికూలింగ్ వాటర్ కావలసినవారు సొసైటీ వద్దకువచ్చి ఈ సదావకాశాన్నిఉపయోగించు కొనగలరు.

## ఉప్పల్ రింగ్ రోడ్లో త్వరలో స్కై వాక్ ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



మేడిపల్లి, మే25 (ప్రజాపాలన ప్రతినిధి)ఉప్పల్ రింగ్ రోడ్లో అతి త్వరలో స్కైవాక్ ను ప్రజలకు అందుబాటులోనికి తీసుకొస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి తెలిపారు. ఉప్పల్ క్రాస్ రోడ్ వద్దగల స్కైవాక్ నిర్మాణం తుది దశకు చేరుకున్న తరుణంలో పనులను హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి అధికారులు, స్థానిక కార్పొరేటర్ తో కలిసిఎమ్మెల్యే సుభాష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉప్పల్ క్రాస్ రోడ్ వద్ద గల ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు నాలుగు రోడ్లను కలుపుతూ దాదాపు రూ 25 కోట్ల వ్యయంతో స్కైవాక్ నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. ఈ స్కైవాక్ కు 8 లిఫ్టు ,నాలుగు ఎస్కలేటర్లు, వాటిని ఆనుకొని ఆరు మెట్ల దారి నిర్మాణం చేపట్టారని ఈ స్కైవాకును అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ డి.ఈ సుభాష్, ఏ.ఈ చందు, ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ ఇంజనీర్ నాగేందర్, ఏ ఈ వసంత, స్థానిక కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతి రెడ్డి, వేముల సంతోష్ రెడ్డి, మస్కు సుధాకర్, అన్య వెంకటేష్, గొరిగే ఐలేష్, భరత్ రెడ్డి, శ్రీకాంత్, వేముల వెంకట్ రెడ్డి, అరటికాయల వంశీ ముదిరాజ్, నాగూర్ భాష, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మత్తుల పనులు పరిశీలించిన కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్రావు



మేడిపల్లి, మే25 (ప్రజాపాలన ప్రతినిధి) : రామంతాపూర్ డివిజన్లో రోడ్డు మరమ్మత్తుల పనులను స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట రావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డివిజన్లోని వివిధ కాలనీలలో ఎక్కడైతే రోడ్లు పాడైపోయినాయో అక్కడ త్వరగా బీటీ రోడ్లు అప్పటికప్పుడు వేయిస్తున్నామని తెలిపారు.

# సర్పంచ్ ,కార్యదర్శి దోస్తానంతో జోరుగా సాగుతున్న పంచాయితీ అక్రమ తీర్మానాలు

### పాలకవర్గ సభ్యులు లేకుండానే ఇష్ట రాజ్యాంగ వారి పనితీరు



బోనకల్, మే 26 ప్రజా పాలన ప్రతినిధి: సర్పంచ్, కార్యదర్శి దోస్తానంతో పంచాయతీ అక్రమ తీర్మానాలను కొనసాగిస్తున్న తీరు మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామపంచాయతీలో చోటుచేసుకుంది. లక్ష కాదు ...రెండు లక్షల కాదు ....ఏకంగా 50 లక్షల రూపాయల పనులకు గ్రామపంచాయతీ మెజార్టీ సభ్యుల పాలకవర్గం లేకుండానే సర్పంచి ,పంచాయతీ కార్యదర్శి ఇద్దరు కలిసి పనులకు తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపటం ఇలా ఒకటి కాదు రెండు కాదు గడచిన నాలుగేళ్లలో ఈ పంచాయతీలో ఈ తరహాలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరును పరిశీలిస్తే నేనే మోనార్క్ ని నన్ను ఎవరు ఏమి చేయలేరు అనే రీతిలో దర్జాగా పాలన కొనసాగిస్తున్నారు. వివరాలకు వెళితే మండల పరిధిలోని గోవిందపురం ఎల్ గ్రామపంచాయతీలో పదిమంది పాలకవర్గ సభ్యులు ఉన్నారు. వాస్తవానికి గ్రామపంచాయతీ తీర్మానం ఆమోదించాలంటే పంచాయతీ సమావేశంలో మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకనే తీర్మానం చేసి అట్టి తీర్మానాన్ని సంబంధించిన పనుల ప్రతిపాదనలకు గాను ,కొత్త పనుల నిర్మించుకునేందుకుగాను, గ్రామపంచాయతీ అభివృద్ధి కొరకు, చెల్లుబాటు అవుతుందనేది జగమెరిగిన సత్యం కాని దీనికి విరుద్ధంగా ఇక్కడ పాలిస్తున్న సర్పంచ్ తో పాటు పంచాయతీ కార్యదర్శి ఇద్దరు దోస్తానాంతో ఇష్టానురాజ్యంగా తీర్మానాలు చేసుకుంటూ ఒంటెద్దు పోకడగా పోతున్నటువంటి పరిస్థితి దాపరించాయని పాలకవర్గ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా గ్రామపంచాయతీ తీర్మానం చేసినట్టు గాని కొత్త అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్టుగాఏ మాత్రం గ్రామ ఉపసర్పంచ్ గాని మిగిలిన పాలకవర్గ వార్డు సభ్యులకు గానీ సంబంధించిన అధికారి చెప్పకపోవడం ఏంటని పలువురు మండిపడుతున్నారు. గ్రామపంచాయతీ సమావేశం నిర్వహించాలంటే రెండు రోజులు ముందుగానే పంచాయతీ కార్యదర్శి గ్రామపంచాయతీ తీర్మానం పుస్తకంలో ఏజెండా పెట్టి పాలకవర్గ సభ్యులు హాజరుకావాలని సమాచార ఇవ్వాల్సిన పరిస్థితి కానీ, అటువంటిది ఏమీ జరగకుండానే ఎటువంటి అజెండా లేకుండానే.... ఎవ్వరు పాలకవర్గ సభ్యులు రాకుండానే తీర్మానం చేసి సుమారు 50 లక్షల రూపాయల వరకు పనులకు ప్రతిపాదనలు పంపి చేతులు దులుపుకున్నటువంటి పరిస్థితులు ఉన్నాయని పాలకవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని గ్రామ ఉపసర్పంచ్ తో పాటు పాలకవర్గ సభ్యులకు కూడా కార్యదర్శి సర్పంచ్ని నిలదీస్తే మీకు చెప్పేది ఏముంది.... మీ వల్ల అయ్యేదేముంది.... మీరు వస్తే ఎంత ...రాకపోతే ఎంత ...మీ సంతకాలు ఎవరికి అవసరం? ఎవరికీ అవసరం లేదు తీర్మానాలకు మీ సంతకాలికి పనేలేదు అంటూ సర్పంచ్ బుకాయించటం బెదిరింపులకు పాల్పడటం మీరు దిక్కున కాడ చెప్పుకోండి అంటూ వ్యవహరిస్తున్న తీరు పలు విమర్శలకు తావిస్తోంది దీనితోపాటు గ్రామంలో ఉన్న అఖిలపక్ష పార్టీలను సమన్వయం చేయవలసినటువంటి ఓ పంచాయతీ అధికారి కూడా అట్టి సర్పంచ్ కు వత్తాసు పలకడంతో ఇది కాస్త ముదిరి పాకాన పడినటువంటి పరిస్థితి గ్రామ పంచాయతీలో చోటుచేసుకుందని గ్రామస్తులు తెలిపారు. ఇట్టి విషయంపై పాలకవర్గ సభ్యులతో పాటు జిల్లా పంచాయతీ అధికారికి ఉపసర్పంచి పాలకవర్గ సభ్యులు పలుమార్లు ఫిర్యాదు చేసిన గాని నిమ్మక నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పాలకవర్గ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి గ్రామపంచాయతీలో జరుగుతున్న అక్రమ తీర్మానాలు గాని పంచాయతీ నిధుల అవకతవకులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అరికట్టేందుకు మండల అధికారులకు తెలియజేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని జిల్లా ఉన్నతాధికారులు కంకణం కట్టుకొని న్యాయం చేయాలని పాలక వర్గసభ్యులు, ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య ,ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, చింతలచెరువు కళావతి ,పసుపులేటి పద్మ, రాచబంటి రుక్మిణి, షేక్ మస్తాన్, బి రాంబాబు, పొన్నం రాంబాబు, దువ్వల నాగేంద్ర తదితరులు కోరుతున్నారు.

## దేవరంపల్లి లో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం





చేవెళ్ల,మే 25, (ప్రజాపాలన):కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు,సద్వినియోగపరచుకోవాలని సర్పంచ్ నరహరి రెడ్డి తెలిపారు. చేవెళ్ల మండల పరిధిలో దేవరంపల్లి గ్రామంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ నరహరి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలోని ప్రతి ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టాలని ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో అందత్వ నివారణ లక్ష్యంగా ఈ కంటి వెలుగు కార్యక్రమం. ఈ కంటి వెలుగు శిబిరం వద్ద కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత మందులు, కళ్లద్దాలు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లేష్ వార్డ్ సభ్యులు,గ్రామ పెద్దలు మరియు కంటె వెలుగు సిబ్బంది, డాక్టర్ సంగీత,డాక్టర్ అబ్దుల్ అథిక్, సూపర్వైజర్ పాలమ్మ ,డీఈవో శివరాజు,మల్లేష్,గారు మరియు ఏఎన్ఎంలు,ఆశాకార్యకర్తలు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వివిధ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లాపరిషత్ చైర్మన్ కమల్ రాజు...



ఎర్రుపాలెం మే 25 గురువారం (ప్రజాపాలన ప్రతినిధి): ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా అనేక శుభ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ,స్థానిక మండల కేంద్రమైన ఎస్సీ కాలనీలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన కోట సతీష్ బి ఆర్ ఎస్ ,పార్టీ సభ్యత్వం పొంది ఉన్నారు .ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన 2,00,000/-లక్షల రూపాయల చెక్కును సతీష్ సతీమణికి (నామిని) కోట కవితకు, మండల ప్రజా ప్రతినిధులతో కలిసి జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కామరాజు నేరుగా అందజేశారు. కుటుంబానికి ధైర్యాన్ని ఇచ్చి పిల్లలను ఉన్నతమైన చదువులు చదివించుకోవాలన్నారు .అనంతరం రేమిడిచర్ల గ్రామంలో బండి డానియల్ కుమార్తె ప్రధాన కార్యక్రమంలో పాల్గొని నవవధువును దీవించారు. అదే గ్రామానికి చెందిన దర్శి వెంకటేశ్వరరావు కుమార్తె వివాహం జరగ నూతన వధూవరులనుఆశీర్వదించారు. మరియు మండల పరిధిలోని మీనవోలు గ్రామవాసి కుడుములు మధుసూధన రెడ్డి ,ఎర్రుపాలెం రింగ్ సెంటరు సమీపమున నిర్మించుకున్న శుభమస్తు కల్యాణము మండపంను తమ స్వహస్తాలతో ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, మండల అధ్యక్షులు పంబి.సాంబశివరావు, కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి,మహిళా అధ్యక్షురాలు పులి శిరీష, శీపాలిశెట్టి తిరుపతిరావు,దేవరకొండ రవి, భాస్కర్ రావు,రాజు , వివిధ హోదాలో ఉన్న నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు .

## తెలంగాణ పర్యటనలో హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుక్వీందర్ సింగ్ సుఖ్ ను స్వాగతించిన టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి






ఇబ్రహింపట్నం మే తేది 25 ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర పర్యటనకు మొదటిసారిగా విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖ్ ని గురువారం రోజున శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ గౌరవ మాణిక్ రావ్ థాక్రే మనందరి అభిమాన నాయకుడు టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి తో కలిసి ఘనస్వాగతం పలికిన టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## మానకొండూరులో ఎమ్మెల్యే తొలి పొద్దు పర్యటన



శంకరపట్నం మే 25 ప్రజాపాలన రిపోర్టర్: మానకొండూర్ మండలం వెల్ది గ్రామంలో గురువారం ఉదయం మాన కొండూర్ శాసనసభ్యులు డా. రసమయి బాలకిషన్ తొలిపొద్దు పర్యటనలో భాగంగా పర్యటిస్తూ లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణి చేశారు. ఓ ఇంటికి చెక్కు అందజేడానికి వెళ్లగా న్యాత తార అనే ఓ వృద్ధురాలు తన ఇంటి ముందు కట్టెల పొయ్యిపై వంట చేస్తుంది. ద్విచక్ర వాహనంపై వెళ్లిన రసమయిని చూసిన వృద్ధురాలు ఆయనకు ఎదురుగా వెళ్లి బిడ్డా రసమయి మంచిగున్నావా అంటూ ఎదురొచ్చి ఆప్యాయ్యంగా ఆలింగనం చేసుకుంటూ స్వాగతం పలికింది. కష్టం విలువ తెలిసిన నాయకుడు, ప్రజాసేవకుడయినా రసమయి ఆమె ఇంటి ముందు నేలపైనే కూర్చొని అవ్వతో కాసేపు ముచ్చటించారు. మా లాంటి పేదోళ్లకు ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి పైసలు ఇచ్చి కేసిఆర్ సారూ పెద్ద కొడుకు, నువ్వు సిన్న కొడుకులయ్యింద్రు, పొయ్యి మీదా టమాటా కూర ఉడుకుతాంది కొంచెం బువ్వ తినిపో బిడ్డా అంటూ అవ్వ అన్న మాటలకు రసమయి చలించిపోయారు. అవ్వా నీ ప్రేమ నామీద ఎప్పుడు ఇట్లనే ఉండాలే, మీలాంటి ఎంతో మంది అవ్వలను సీఎం కేసీఆర్ గుండెలో పెట్టుకొని సాదుకుంటుండు, నీ మనుమరాలు శ్వేత పెళ్లి కోసం కళ్యాణలక్ష్మి పథకం కింద చెక్కు పంపిండు అంటూ చెక్కుతో పాటు చీరను ఎమ్మెల్యే అందజేశారు. మానకొండూర్ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ కి ప్రజాధరణ రోజు రోజుకు పెరుగుతున్న ఆదరణకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది ఈ సంఘటన. రేయనకా, పగలనకా, ప్రతిరోజు తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తూ, ప్రజలతో మమేకమవుతున్న నాయకుడికి ప్రజలు నీరాజనం పడుతున్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

**శుక్రవారం 26, మే 2023**

# పెద్దలకే మేలు...

రెండు వేల నోట్ల ఉపసంహరణ వల్ల నల్లధనం ఉన్నవారు లబ్ధి పొందకుండా కట్టుదిట్టం చేస్తామంటున్నారు. 2016లో విధించిన నిబంధనల ప్రకారం ఎక్కువ నోట్లు మార్చుకోవడానికి వీల్లేదన్నారు. ఈసారి కూడా ఒక్క విడతలో మార్చుకోగలిగిన మొత్తం ఇరవై వేలే. అలా ఎన్ని విడతలకైనా ఒక్కరోజే మార్చుకోగలగడం సంపన్నులకే ప్రయోజనం. ఇది నల్లడబ్బును వైట్‌గా మార్చుకోవడానికి ఉపకరిస్తుంది. అంతిమంగా నోట్లరద్దు ప్రధాని చెప్పిన ఏ ఒక్క లక్ష్యాన్నీ సాధించకపోగా భారత ఆర్థిక వ్యవస్థనే అథోగతిపాలు చేసిందని ఈ వాస్తవాలన్నీ రుజువు చేస్తున్నాయి. చెలామణిలో ఉన్న రెండు వేల రూపాయల నోట్ల ఉపసంహరణకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మే 23 నుంచి సెప్టెంబర్ 30లోపు తమ వద్ద రెండు వేల నోట్లున్నవారు బ్యాంకుల్లో, ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాల్లో మార్చుకొనే అవకాశం కల్పించింది. అందుకు కొన్ని పరిమితులు విధించింది. క్లీన్ నోట్ పాలసీ కింద 2 వేల నోటు రద్దు చేశామంటూ ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. అసలు క్లీన్ పాలసీ అంటే ప్రజలకు మంచి నాణ్యమైన నోట్లు అందుబాటులోకి తేవడం కదా. మరి ఉన్న నోట్లను రద్దు చేస్తూ ఆకస్మిక ప్రకటనలెందుకు? కాలం అన్ని రకాల గాయాలను మాన్పుతుందంటారు. కానీ మన ప్రధానమంత్రి చేసిన గాయం మాత్రం రాచపుండై కాలం గడిచేకొద్దీ రెచ్చుతోంది. దానిపై మళ్లీ కారం చల్లే పనిని ఆర్బీఐకి అప్పగించింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ 2016లో చేసిన నోట్ల రద్దు ప్రకటన భారత ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. చెలామణిలో ఉన్న రూ.500, 1000 నోట్లు రద్దు చేస్తున్నట్టు హడావిడిగా మోడీ ప్రకటించారు. అనంతరం రూ.2000 నోట్లను తెచ్చింది. ఇప్పుడు దానిని కూడా నేటి నుంచి ఉపసంహరించు కుంటున్నట్టు ప్రకటించింది. దేశీయంగా ప్రస్తుతం చెలామణిలో ఉన్న రూ.3.62 లక్షల కోట్ల విలువైన రెండు వేల రూపాయల నోట్లలో ఎనభై శాతం అతి కొద్ది మంది చేతుల్లోనే ఉన్నట్టు అంచనా. అందులో సింహభాగం అక్రమ లావాదేవీలకే ఉపయోగ పడుతున్నాయన్న నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షులు అరవింద్ పనగడియా వ్యాఖ్యలు బడాబాబుల బాగోతాలకు అద్దం పడుతున్నాయి. ప్రధాని చెప్పినట్టు డిజిటల్ లావాదేవీలు గనుక పెరిగితే వాస్తవంలో కాగితపు కరెన్సీ చెలామణి తగ్గిపోవాలి. కానీ జరిగింది ఏమిటి? 2016లో పెద్ద నోట్ల రద్దు జరిగిన రోజుకు నాలుగు రోజుల ముందర చెలామణిలో ఉన్న కాగితపు కరెన్సీ మొత్తం విలువ 17.74లక్షల కోట్ల రూపాయలు. కాగా, 2022 డిసెంబర్ 23 నాటికి రిజర్వ్ బ్యాంకు గణాంకాల ప్రకారమే ఈ మొత్తం 32.42 లక్షల కోట్ల రూపాయలు. అంటే, కాగితపు కరెన్సీ స్థానంలో డిజిటల్ కరెన్సీని ప్రవేశపెట్టే లక్ష్యం, పూర్తిగా వికటించిందన్నది వాస్తవం. ఈ కాలంలో కాగితపు కరెన్సీ చెలామణి రెట్టింపైంది. మరోపక్క యూపీఐ చెల్లింపులూ, క్రెడిట్, డెబిట్ కార్డుల చెల్లింపులూ, ఆన్‌లైన్ రూపంలో జరిగే లావాదేవీలు కూడా భారీగానే పెరిగాయి. 2వేల నోట్లు నేడు సాధారణ చెలామణిలో కనబడటం లేదు. మరి ఆ నోట్లన్నీ ఏమైనట్టు? ఈ మరింత పెద్దనోటు నేడు బడాబాబులు, అవినీతి రాజకీయ నేతలూ, రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవసరాల కోసం నల్లడబ్బుగా అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిపోయింది. అంటే, పెరిగిపోయిన కాగితపు కరెన్సీ చెలామణిలోని సింహభాగం నేడు 'పెద్ద మనుషుల' లావాదేవీల రూపంలో లెక్కలకు చిక్కకుండా తిరుగాడుతున్నది. కాగా, సామాన్య జనం చెల్లింపులూ, లావాదేవీలూ మాత్రం బహు పారదర్శకంగా నేడు డిజిటల్ ఎకానమీలో ప్రభుత్వ జీఎస్టీ ఆదాయపు రికార్డు స్థాయి పెరుగుదలగా నమోదవుతున్నది. యు.పి ఎన్నికల వేళ హడావిడిగా పెద్దనోట్లను రద్దుచేసిన బిజెపి సర్కార్.. కర్ణాటకలో కన్ను లొట్టపోయిన తరువాత, మరో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముంగిట ఉండగా రూ.2000 నోటును వెనుకకు తీసుకుంటున్నది. కేవలం సంపన్నుల ప్రయోజనం కోసమే ఈ నోట్లను ఇంతకాలం చెలామణిలో ఉంచారన్నది వాస్తవం. పెద్ద నోట్ల రద్దు సమయంలో భారీ ఎత్తున వస్తుందన్న గుత్తధనమంతా వైట్ మనీ అయిపోయి ఆర్థిక వ్యవస్థలో కలిసిపోలేదా? ఇప్పటికీ అటువంటి దొడ్డిదార్లు తెరుచుకొని ఉంటాయనడంలో సందేహం అక్కర్లేదు. 2 వేల నోట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నారని, దొంగ సొమ్ము దాచుకోడానికి, ఉగ్రవాదులకు సాయం చేయడానికి వాటిని ఉపయోగిస్తున్నారని, వాటిని రద్దుచేయాలని బిజెపి ఎం.పి సుశీల్ మోడీ గత డిసెంబర్ లోనే రాజ్యసభలో డిమాండ్ చేశారు. కానీ, ఆ ఉద్దేశమే లేదని కేంద్రం పార్లమెంటుకు చెప్పింది. ఆరు నెలలు గడిచేలోపు ఉన్నట్టుండి రద్దు చేయడంలోని ఆంతర్యమేంటి ? 2016లో రద్దు చేసిన నోట్లలో 99.3 శాతం రిజర్వు బ్యాంకుకు చేరాయి. అంటే ప్రత్యక్షంగా నల్లధనం అని తేలిందేమీ లేదు. ఇప్పుడూ నల్లధనం తగ్గే అవకాశాలు ఏమీ ఉండవు. రెండు వేల నోట్ల ఉపసంహరణ వల్ల నల్లధనం ఉన్నవారు లబ్ధి పొందకుండా కట్టుదిట్టం చేస్తామంటున్నారు. 2016లో విధించిన నిబంధనల ప్రకారం ఎక్కువ నోట్లు మార్చుకోవడానికి వీల్లేదన్నారు. ఈసారి కూడా ఒక్క విడతలో మార్చుకోగలిగిన మొత్తం ఇరవై వేలే. అలా ఎన్ని విడతలకైనా ఒక్కరోజే మార్చుకోగలగడం సంపన్నులకే ప్రయోజనం. ఇది నల్లడబ్బును వైట్‌గా మార్చుకోవడానికి ఉపకరిస్తుంది. అంతిమంగా నోట్లరద్దు ప్రధాని చెప్పిన ఏ ఒక్క లక్ష్యాన్నీ సాధించకపోగా భారత ఆర్థిక వ్యవస్థనే అథోగతిపాలు చేసిందని ఈ వాస్తవాలన్నీ రుజువు చేస్తున్నాయి. ఈ ప్రమాదాన్ని ముందే పసిగట్టిన ఎందరో ఆర్థిక నిపుణులు హెచ్చరించినా లెక్కచేయని మోడీ అంతరంగమేమిటో ఈ ఆరున్నరేళ్లుగా అనుభవాలు అవగతం చేస్తున్నాయి. ఇప్పటికైనా తప్పుదిద్దుకోవాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకపోగా ఇంకా మోసానికి తెర తీసింది. కొందరిని కొంతకాలమే మోసం చేయగలరేమో గానీ, అందరినీ అన్ని వేళలా మోసం చేయలేరనే సత్యాన్ని ఏలికలు ఇప్పటికైనా గుర్తిస్తే మంచిది.

# అంబేద్కర్ మార్గమే రాజ్యాధికార ఎజెండా



కర్ణాటక ఎన్నికల పోరాటంలో కాంగ్రెస్ విజయభేరి మోగించటం వెనుక దళిత మైనార్టీల ఐక్యతా శక్తి బలంగా ఉంది. దక్షిణ భారత దేశంలో విస్తృతమవ్వాలని ప్రయత్నించిన బి.జె.పి. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ వంటి హిందూ మతోన్మాద రాజకీయ శక్తులకు బలమైన విఘాతం జరిగింది. దీనికి కారణం భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించి విశ్వహిందూ పరిషత్తు, ఆర్.ఎస్.ఎస్. మోడీని అధిగమించి రాజ్యం చేస్తున్నాయా అన్నంత బలంగా మతోన్మాద కార్యక్రమాలు భారతదేశంలో సామాజిక, సాంస్కృతిక, సాంకేతిక విద్య రంగాలలో విజృంభించటం డా॥బి.ఆర్.అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగానికి వెన్నుపోటు పొడుస్తున్నారన్న సంకేతం ప్రజలకు అందినది. ఇకపోతే ఇప్పుడు కర్ణాటకలో కాంగ్రెస్ 135 స్థానాలలో ఘన విజయం సాధించింది. బి.జె.పి. 66 స్థానాలకే పరిమితం అయ్యింది. జె.డి.యస్.కి 19 స్థానాలే వచ్చాయి. 4 స్థానాలు ఇతరులకు వచ్చాయి. దీన్ని బట్టి స్వయాన ప్రధానమంత్రి కర్ణాటకలో విస్తృతమైన ర్యాలీలు, రోడ్‌షోలు చేసి ప్రచారం చేసినా ప్రజలు పట్టించుకోలేదు అనే విషయం అర్థం అవుతుంది. నిజానికి దక్షిణ భారత దేశం లౌకిక వాదానికి పెట్టని కోట. ప్రజాస్వామిక, లౌకిక సామ్యవాద భావాలపై బి.జె.పి. నిరంతరం గొడ్డలివేటు వేస్తూ వస్తుంది. నిజానికి దక్షిణ భారతదేశంలో ద్రావిడ భాషలైన తెలుగు, తమిళం, మళయాళం, కన్నడ భాషలు స్వతంత్ర ప్రతిపత్తి కలిగినవి. ఇవి సంస్కృతేతరమైన భాషలు. ద్రవిడ భాషలే కాక దక్షిణాదివారి సంస్కృతి వీరి జీవన విధానం. వీరి ఆహార, ఆహార్య పద్ధతులు హిందూ సంస్కృతికి భిన్నమైనవి. దక్షిణ భారతదేశంలో ఎన్నో సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాలు జరిగాయి. ముఖ్యంగా పెరియార్ రామస్వామి నాయకర్ రూపొందించిన డి.ఎం.కె. పార్టీ ద్వారా ఉత్తర భారత సామ్రాజ్యాధిపత్యాన్ని ఎదురించటం ఆచరణ బద్ధంగా జరిగింది. ఇటు దళిత ఉద్యమాలు, కమ్యూనిస్టు ఉద్యమాలు కూడా సామాజిక చైతన్యాన్ని ప్రజలలో కలిగిస్తున్నాయి. అయితే బి.జె.పి. ప్రభుత్వం వచ్చాక ఈ దక్షిణ భారతదేశంపై హిందూ సామ్రాజ్యవాద భావ జాలాన్ని, హిందీ భాషాధిపత్య భావ జాలాన్ని రుద్దాలని చూస్తున్నారు. అది కూడా దక్షిణాది వారు కనిపెట్టారు. ముఖ్యంగా భారత, భాగవత, రామాయణ కథల ప్రభావం బి.జె.పి. పరిపాలనా విధానంలో ఉంది. అందుకే వాళ్ళు అనేక రాష్ట్రాలలో గెలిచిన ప్రభుత్వాలని చీల్చి ఒక గ్రూపును తమతో కలుపుకొని, ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నారు. దానికి మహారాష్ట్ర తాజా ఉదాహరణ. శివసేనను చీల్చారు. ఉత్తమ్ థాకరే ప్రభుత్వాన్ని కూల్చారు. బి.జె.పి. అండతో మరొకరిని ఎక్కించారు. మణిపూర్‌లో ఈనాడు రగులుతున్న విధ్వంసానికి కూడా బి.జె.పి.యే కారణం. 2017లో బి.జె.పి తొలిసారిగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈశాన్య ప్రాంతమైన మణిపూర్‌లో ఆధిపత్యం వహించేందుకు ప్రయత్నం చేస్తూనే ఉంది. 60 మంది సభ్యుల మణిపూర్ అసెంబ్లీలో కేవలం 21 మందే ఎమ్మెల్యేలు బి.జె.పి.కి ఉన్నారు. కాంగ్రెస్‌కి 28 మంది సభ్యులు ఉన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ఎలాగోలా పీఠం ఎక్కారు. మణిపూర్‌లో హింసాకాండ కొనసాగడానికి కారణం గిరిజనుల హక్కులను, రిజర్వేషన్లను కాలరాయడానికి బి.జె.పి.చేస్తున్న దుర్వ్యూహాలే. ఇక దక్షిణాదికి వస్తే దక్షిణ భారతదేశం ఏ ఉత్తర భారతీయ ప్రధానికీ అర్థం కాలేదు. నిజానికి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బి.జె.పి. ప్రాంతీయ నాయకులను ఎవర్నీ మాట్లాడనీయలేదు. బి.జె.పి మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న యడ్యూరప్ప కూడా ఎక్కడా నోరు విప్పలేకపోయాడు. ముఖ్యమంత్రిగా ఉన్న బొమ్మాయికి ఉనికే లేదు. నరేంద్ర మోడీ, అమిత్‌షా 120 మంది బి.జె.పి. కేంద్ర నాయకులు కర్ణాటక మీద పడ్డారు. కర్ణాటక సంస్కృతిని, దేశీయతని, భాషని ధ్వంసం చేయాలని చూశారు. కానీ కాంగ్రెస్ ఎంతో కొంత లౌకిక సామాజిక శక్తులను కలుపుకొని వెళ్ళగలిగింది. అది కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ పాదయాత్ర ద్వారా వచ్చిన ఒక మార్పు. రాహుల్ గాంధీ పాదయాత్ర ద్వారా చాలా నేర్చుకున్నాడు. ముఖ్యంగా యువకులు, స్త్రీలు, నిరుద్యోగులు ఎంతో జీవన సంక్షోభంలో ఉన్నట్టు అర్థమైంది ఆయనకు, ఆయన సహచరులకు అర్థమైంది. నిజానికి వీరు ప్రవేశపెట్టిన పంచ సూత్రాలు గెలుపుకి ఎంతో కొంత పని చేశాయి. గృహజ్యోతి యోజన్ పథకం అనేది ఇప్పుడు చాలా ముఖ్యం ఎందుకంటే ప్రతి ఇంట్లో టి.వి., సెల్‌ఫోన్, కుక్కర్, కరెంటు స్టవ్ ఉంటున్నాయి. ఈ సందర్భంలో ప్రతీ ఇంటికి 200 యూనిట్స్ వరకు ఉచిత కరెంటు ఇవ్వడం మిడిల్ క్లాసు వారికి, లో మిడిల్ క్లాసు వారికి వెసులుబాటు కలుగుతుంది. ఇక గృహలక్ష్మి యోజన పథకం రెండవ పథకం వల్ల ఇంటి పెద్దగా ఉన్న ప్రతీ మహిళకు 2000 ఆర్థిక సహాయం దొరుకుతుంది. దాని వల్ల కోటి యాభై లక్షల మంది స్త్రీలకు వెసులుబాటు దొరుకుతుంది. అమ్మ భాగ్యం అనే మూడవ పథకం ద్వారా బిలో పావర్టీలో ఉన్న వారికి 10 కిలోల ఉచిత బియ్యం ఇస్తాము అని వాగ్దానం చేశారు. ఇకపోతే యువనిధి అనే నాల్గవ పథకం ద్వారా డిగ్రీ చదివిన నిరుద్యోగులకు 3000/- డిప్లమా చేసిన వారికి 1500/- నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఇక మరి ముఖ్యమైన పథకం ఆర్.టి.సి. బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఇది అన్ని రాష్ట్రాలలో అమలు జరగాల్సిన అవసరం కనబడుతోంది. నిజానికి ఈ పథకాల ప్రభావం ప్రజల మీద బలంగా పడింది. అయితే భూమి పంపకం, ఉద్యోగ కల్పన, ఆరోగ్య రక్షణ, మాతా శిశు సంక్షేమం అస్పృశ్యత నివారణ వంటి వాటి పట్ల కాంగ్రెస్ ఇంకా సరైన నిర్ణయానికి రాలేకపోతుంది. నిజానికి భారత దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ కూటమి బి.జె.పి.ని ఎదురించాలంటే తప్పక భూమి పంపకం, ఉద్యోగ వసతి కల్పన, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడం, ప్రాథమిక వైద్యశాలలు, ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం వంటి పథకాలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉంది. డా.బి.ఆర్.అంబేద్కర్ చెప్పినట్లు కుల నిర్మూలనా సమాజం ఏర్పడుతున్న ఈ సమయంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ గారు అమలు జరుపుతున్నట్లు కులాంతర మతాంతర వివాహులందరికీ 10,00,000 (పది లక్షలు) ఎక్స్‌గ్రేషియా, గృహ వసతి, ఉద్యోగ వసతి కల్పించాల్సిన చారిత్రక అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీ గానీ ఇతర లౌకిక వాద పార్టీలు గానీ ఈ సామాజిక పరిణామమును గుర్తించకపోతే ఈ పార్టీలు విజయ కేతనం ఎగుర వేయలేవు. ఈ విషయంలో కేరళ ముఖ్యమంత్రి విజయన్ గారు ముందున్నారు. కులాంతర వివాహితులకు ఉద్యోగ వసతి, జీవన భృతి, రక్షణ కేంద్రాలు కూడా నిర్మించారు. ముఖ్యంగా అమ్ ఆద్మీ పార్టీ కేజ్రివాల్ అమలు జరుపుతున్న విద్యుత్తు, నీరు వంటివి ప్రజలకు సక్రమంగా అందించుటయే గాక కార్మికులకు ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. వలస కూలీలు పెరుగుతున్న ఈ సందర్భంలో కార్మికులకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేయటమనేది చాలా సముచితమైన నిర్ణయం. తెలంగాణ ముఖ్యమంత్రి కె.సీ.ఆర్. గారు ప్రవేశపెట్టిన దళితబంధు పథకం ద్వారా దళితులకు న్యూ ఇండస్ట్రీ పాలసీలో ప్రవేశం దొరుకుతుంది. దళితులు అర్బనైజ్ అవ్వడానికి ఎక్కు అవకాశం ఉంది. అంబేద్కర్ ఆనాడు ప్రవేశపెట్టిన ల్యాండ్ పర్చేజింగ్ స్కీం కూడా దళితులకు చాలా ఉపయోగం ఈ పథకాన్ని అన్ని రాష్ట్రాలలో అమలు జరపాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నాడు, నేడు, అమ్మ ఒడి పథకాల ద్వారా విద్యా వ్యవస్థ పునరుజ్జీవనమవుతుంది. ఈ పథకాలు కూడా భారతదేశ వ్యాప్తంగా అమలు జరగాల్సిన అవసరం ఉంది. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మద్యపాన నిషేధాన్ని పట్టుదలలో అమలు జరుపుతూ, క్షీర విప్లవాన్ని ఉత్తేజం చేశారు. ఇకపోతే మమతా బెనర్జీ పారిశ్రామిక విప్లవానికి ద్వారాలు తెరిచింది. స్త్రీలు, దళితులు రాబోయే కాలాలలో అన్ని రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా రావాల్సిన అవసరం ఉంది. మద్యపానం విజృంభించుట వల్ల భర్తలు ఎక్కువగా విడోలు ఎక్కువవుతున్నారు. అందువల్ల విడోస్ పరిరక్షణ పథకాలు పెరగాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా బి.జె.పి. ప్రభుత్వం వయోజన విద్య మీద, ఉపాధి పథకం మీద గొడ్డలి వేటు వేసింది. నిరుద్యోగుల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది. వలస కూలీలు రాష్ట్రాలను దేశాలను పట్టుకొని వెళుతున్నారు. వారికి ఏ ప్రాంతాలలోను షెల్టర్సు లేవు ఉచిత వాహన సదుపాయం లేదు. ముంబాయి, కొల్‌కత్తా, బెంగుళూరు, హైదరాబాద్ వంటి పెద్ద పెద్ద నగరాలు దుర్భాగ్యమైన స్థితిలో వలస కూలీలు అంతులేని (స్లమ్ ఏరియా) మురికి వాడలలో జీవిస్తున్నారు. ఏ పార్టీ కూడా వీరి పునరావాసానికి పథకాలు రూపొందించలేకపోతుంది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం విధ్వంసం చేసిన రంగాలన్నింటిని అందరూ కలిసి పునరుజ్జీవనం చేసుకోవాల్సిన రాజకీయ పోరాట సందర్భం ముందుకు వచ్చింది. రాజకీయాలలో భారత రాజ్యాంగం రూపొందించిన అంబేద్కర్ ఆలోచనలలోని "ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడం" అనే అంశం ఈనాడు చాలా ముఖ్యం.ఏ అదానీకో, అంబానీకో ఏ పార్టీలు, ఏ ప్రభుత్వాలు లొంగిపోయినా దేశం తాకట్టులోనికి వెళుతుంది. ఇప్పటికే 75% దేశం తాకట్టులో ఉంది. దేశంలోని ప్రధాన మౌలిక వనరులన్నీ ఇతర దేశాల తాకట్టు లోకి వెళుతున్నాయి. దిగుమతులు పెరుగుతున్నాయి. ఎగుమతులు తగ్గుతున్నాయి. ప్రధానంగా భారత దేశం మేధో సంపద, యువశక్తి ఇతర దేశాలకు పరుగులిడుతున్నాయి. వీరందరినీ మన దేశంలోనే సాంస్కృతిక, సాంకేతిక, శాస్త్రజ్ఞాన, పర్యావరణ పరిరక్షణ రంగాలలో పని కల్పించి, నిల్పుకోగలిగితే ప్రపంచంలోనే ఆర్థిక అభివృద్ధిలో మన దేశం ముందుంటుంది. దేశంలో రాజనీతిజ్ఞత పెరగాలి రాజకీయ నాయకులు నీతిమంతులయితే ప్రజలలో నైతిక శక్తి పెరుగుతుంది. కొందరు కార్పోరేటు శక్తులకు కొందరు ఎన్‌జీవోలకు అమ్ముడుపోయి రాజకీయాలు నడిపితే భారతదేశానికి స్వతంత్ర ప్రతిపత్తి స్వీయ వ్యక్తిత్వం విస్తృతి కాదు. డా॥బి.ఆర్.అంబేద్కర్ హిందూ కుల సమాజానికి ప్రత్యామ్నాయంగా కుల నిర్మూలనా సమాజాన్ని ప్రభోధించారు. ఆ వైపు రాబోయే రాజకీయ ప్రణాళికల్లో ప్రధాన అంశం కావాలి. అంబేద్కర్ భారతదేశ పారిశ్రామిక రంగాన్ని, సోషలిస్టు విధానంలో నడపాలి అన్నారు. అంబేద్కర్ మత స్వేచ్ఛ, వ్యక్తి స్వేచ్ఛ సామాజిక సమన్వయం, స్త్రీ ఆత్మ గౌరవం యువశక్తి వినియోగం దేశానికి ముఖ్యం అన్నారు. అందుకే కర్ణాటకలో జరిగిన ఈ ఎన్నికల విజయం నుండి కాంగ్రెస్, మిత్ర పక్షాలు, బహుజన రాజకీయ పక్షాలు అంబేద్కర్ సిద్ధాంతాలతో సమన్వయం అయి రాబోయే 2024 ఎన్నికలకు ప్రత్యామ్నాయ రాజకీయ పోరాటానికి సన్నద్ధం కావాల్సిన చారిత్రక సందర్భం ఇది. ఆ చైతన్యంతో నడుద్దాం....



**డా॥ కత్తి పద్మారావు**
**దళిత ఉద్యమ నేత**
**పొన్నూరు, 9849741695.**



# చెల్లని బతుకు

ప్రజాస్వామ్యంలో సామాన్యుడి
బతుకు చెల్లని నోటయింది
మండే ఎండలో చెమట చిందుతూ
వారాంతాన ఇచ్చి పెద్ద నోటు చెల్లదని
ఏలే వాళ్ళు ఇచ్చిన తాకీదు చూసి

"ఈ వారానికి నేనెట్టా బతికేదీ
నా వాళ్ళ కడుపులనెలా ఓదార్చేది
పని వదిలి నోటెలా మార్చేది
"రద్దన్న పెద్దన్నకేం తెలుసు" చీమ బాధ

చెవుల్లో సీసాలు పోసుకున్న తరువాత
ప్రజాస్వామ్యానికేసిన ముసుగు తెరల్లో చేరాక
కళ్ళు మూసుకున్న పిల్లులై కూచున్నాక
ప్రజల ఘోషేమిటో పాలక మాటేమిటో
వారి ఆదేశాల కత్తులపై నడకేమిటో
తెలిసేదెలా?

ఓటు నాడు నోటు మాట తప్ప
నోరెత్తనివ్వని జనాన్ని నిలిపి నపుడు

రాజ్యాంగంలో రాసుకున్న
ప్రజాస్వామ్యం శవమైంది
ఇప్పుడు జనం ఘోషకూ పాలక భాషకూ
బంధం తెగి ప్రజలది చెల్లని బతుకైంది
తెగిన బంధం కుట్టేదారం పట్టనంత వరకూ
కొత్తగా హత్యకు గురయ్యే నోట్లేమి ఉంటాయి?

**- ఉన్నం వెంకటేశ్వర్లు,**

## భారీ వర్షాలకు కొట్టుకుపోయిన అభరణాలు

బెంగళూరు :భారీ వర్షాలు ప్రజలకే కాదు వర్తకులను కూడా నిండా ముంచేశాయి.బెంగళూరులో కురుస్తు న్న వర్షాలకు అక్కడి మల్లీశ్వర్ లోని ఓ బంగారు దుకాణంలో 80శాతం నగలు కొట్టుకుపోయాయి.వీటి విలువ సుమా రు రెండున్నర కోట్లు ఉంటుందని అంచ నా.వరదల్లో కోట్ల రూపాయల బంగా రం కొట్టుకుపోయిన విచిత్ర ఘటన కర్ణాటకలో చోటు చేసుకుంది. షాపు లోని 80 శాతం నగలు వరదల్లో కొట్టు కుపోయాయి. దీంతో దాదాపు రెండు న్నర కోట్ల నష్టం వాటిల్లిందని తెలుస్తోం ది. యాజమాన్యం ఇది చూసి గగ్గోలు పెడుతున్నారు.గత రెండుమూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల తో నగరం మొత్తం అతలాకుతలం అవుతోంది. భారీవర్షం, వరద ముంచె త్తడంతో బెంగళూరు మల్లేశ్వరంలోని ఓ నగల దుకాణాన్ని ఒక్కసారిగా వరద ముంచెత్తింది. దీంతో షాపు షెటర్లు మూయలేకపోయా రు.మ రోవైపు వరదలతో రహదారులన్నీ చెరువులను తలపించాయి.దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

## జాతీయ బి.సి సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలుగా డా. పద్మ లత

హైదరాబాద్ మే 25 : జాతీయ బి.సి మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు డా.ఏ. పద్మ లత నియమితులైనారు ఈ మేరకు జాతీయ బి.సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్బంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంట్ లో మహిళా బిల్లు పెట్టి మహిళలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అలాగే మహిళ బిల్లులో బి.సి. మహిళలకు సబ్ కోటా కల్పించినప్పుడే బి.సి. మహిళల కు రాజ్యాధికారం దక్కుతుంది అని అన్నారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళ బిల్లులో బి.సి. మహిళలకు జనాభా ప్రకారం సబ్–కోటా ఇవ్వాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మహిళ బిల్లులో బి.సి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్ధకత లేదన్నారు. ఇప్పటికే మహిళ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. లోక్ సభలో కూడా పెట్టి పూర్తి చేయాలని కోరారు. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బి.సి మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ లో మొక్కుబడిగా తీర్మాణం చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా? అని ఆయన ప్రశ్నించారు. మహిళ బిల్లు పాస్ కావాలంటే బి.సి మహిళలకు సబ్–కోటా ఇవ్వక తప్పదు. జనాభాలో సగం ఉన్న బి.సి.మహిళలకు కోటా ఇవ్వకుండా మహిళల గురించి మాట్లాడటం అన్యాయమన్నారు. అనంతరం డా.ఏ. పద్మ లత మాట్లాడుతూ దేశం లో బిసి మహిళల హక్కుల కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.మహిళలు ఒంటింటి కే పరిమితం కారాదని రాజ్యాధికారం లో వాట దక్కినపుడే మహిలా సాదికరికత కు సార్ధకత చేకురగాలదన్నారు. నేడు సమాజం లో మహిళలపై అత్యాచారాలు,వేదింపులు, హత్యలు జరుగుతున్నా వీరి రక్షణ్ కోసం చేసిన చట్టాలు కేవలం కాగితాలకీ పరిమితమైనాయని విమర్శించారు.మహిళా చట్టాలు పకత్బందిగా అమలు చేయాలని పద్మ లత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసారు.తమపై గల నమ్మకం తో తనను జాతీయ బి.సి మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు నియమించిన ఆర్.కృష్ణయ్య కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎర్ర సత్యనారాయణ, సి రాజేందర్ ,నాని ముదిరాజ్, కుమార్ యాదవ్, సత్తిబాబు, జీపీటీ కుమార్, పెంకే శ్రీనివాస్, పి. భూషణం తదితరులు పాల్గొన్నారు.

## మంటలకు బైకు దగ్ధం

అదిలాబాద్:వేసవి కాలంలో ఎండల తీవ్రతకు వాహనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగుతున్న ఘటనలు ఆదిలాబాద్ జిల్లాలో తరచూ జరుగుతున్నాయి. తాజాగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనం నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మొదట వాహనంలో నుండి పొగలు వెలువడగా, కొద్దిసేపటికి మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళన గురయ్యారు. ఈ అగ్ని ప్రమాదంలో బైక్ దగ్ధమైనది. ఐతే ప్రమాదం ఎలా జరిగింది, దగ్ధమైన బైక్ ఎవరిదో ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## యువతలోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే సీఎం కప్

**సేవాదళ్ ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ**

కోరుట్ల :గ్రామీణ, పట్టణ యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ 2023 పేర క్రీడా పోటీలను నిర్వహిస్తుందని శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ డాక్టర్ సిరికొండ శ్రీనివాస్,సేవాదళ్ అధ్యక్షులు పుప్పాల నాగరాజ్ పేర్కొన్నారు.. గురువారం సీఎం కప్ లో భాగంగా జగిత్యాల జిల్లాలో పాల్గొనే కోరుట్ల మండల హ్యాండ్ బాల్ జట్టుకు క్రీడా దుస్తులను కోరుట్ల సేవాదళ్ అధ్యక్షులు పుప్పాల నాగరాజ్, శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ డాక్టర్ సిరికొండ శ్రీనివాస్ సహకారంతో క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు..ఈ సందర్భంగా పుప్పాల నాగరాజు మాట్లాడుతూ యువత చెడు దారుల్లో వెళ్లకుండా క్రీడల్లో నైపుణ్యం పెంపొందించు కోవాలని అన్నారు.ఈ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పిఈటి లు వెంకట్ రెడ్డి ,గంగాధర్, ,చిలుక లక్ష్మీనారాయణ,ఎంఏ బారి, కోరుట్ల మండల హ్యాండ్బాల్ ప్రెసిడెంట్ గిన్నెల విద్యాసాగర్,సెక్రెటరీ పెద్ద బోయిని శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు బొద్దురి హెరాల్డ్, ,కోచ్ గౌటీ .శ్రీనివాస్, కరాటే కోచ్ కొక్కుల రాజేష్ ,పీఈటీలు గౌటి రవీందర్, వాసాల రాజు, వాసం నవీన్ కుమార్, బి. శ్యాం ,కె విజయ్, జ్ఞానేశ్వర్ , సి హెచ్ .శంకర్ బి.వేణు సీనియర్ క్రీడాకారులు దొంతుల రాజు ,శ్రీకాంత్ ,చిరంజీవి, నవీన్,ఎంఏ రబ్బాని, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## లారీ, బస్సు ఢీ..ప్రయాణికులకు గాయాలు


కామారెడ్డి:కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం సంభవించింది. అర్ధరాత్రి రాంగ్ రూట్లో వచ్చిన లారీ ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్తో పాటు ప్రయాణికులకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రునలు 108 సహాయంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి నిజామాబాద్ కు వెళుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

# అమ్మో..స్పీకర్ పదవా..మాకొద్దు

**కర్ణాటకలో వెలుగు చూసిన ఉదంతం.. దేశవ్యాప్తంగా చర్చ**

బెంగళూర్ మే 25 :దేశంలో రాజకీయాలకు–సెంటిమెంటుకు మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది. నాయకులు అయినా.. పార్టీలైనా సెంటిమెంటుకు ప్రాధాన్యం ఇస్తుంటారు. అలానే సెంటిమెంటు చూసుకునే పదవులు ఇస్తారు.. చేపడతారు కూడా.ఇప్పుడు కర్ణాటకలో వెలుగు చూసిన ఒక ఉదంతం.. దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. కర్నాటకలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించిన విషయం తెలిసిందే.దీంతో ఇటీవల ప్రభుత్వం కూడా ఏర్పాటైంది.అయితే రాజ్యాంగం ప్రకారం.. అసెంబ్లీకి స్పీకర్ను ఎన్నుకో వాల్సి ఉంది. ఇది రాజ్యాంగ విధి కూడా. అయితే.. ఇక్కడ చిత్రంగా 136 మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. కొందరు మంత్రులుగా పీఠాలు పొందిన మిగిలిన వారిలో ఒక్కరంటే ఒక్కరు కూడా ఈ పదవిని స్వీకరించేందుకు ముందుకు రాలేదు. అధ్యక్షా అనిపించుకోండి.. అని కాంగ్రెస్ ఆఫర్ ఇస్తే.. మాకొద్దంటే.. మాకొద్దంటూ నాయ కులు తప్పించుకున్నారు.దీనికికారణం సెంటిమెంటు. స్పీకర్ పదవిని స్వీకరించేందుకు ఒక్క కర్నాటకలోనే కాదు.. ఏపీ తెలంగాణ తమిళనాడు కేరళ హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో నూ అధికార పక్షం నాయకులు వెనుకంజ వేస్తున్నారు.దీనికి కారణం స్పీకర్లు గా చేసిన వారు తదుపరి ఎన్నికల్లో విజయం దక్కించుకోలేక పోవడమే. ఏపీ లోనూ.. ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్గా చేసిన యనమల రామకృష్ణుడు మళ్లీ గెలవలేదు. ప్రతిభా భారతి మళ్లీ గెలవలేదు. కేఆర్ సురేష్రెడ్డి నాదెండ్ల మనోహర్ కూడా పరాజయం పాలయ్యారు.తెలంగాణలోనూ.. స్పీకర్గా చేసిన మధుసూదనాచారి మళ్లీ గెలవలేదు. హిమాచల్ ప్రదేశ్లో ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో స్పీకర్ ఓడిపోయారు. తమిళనాడులోనూ అలానే జరిగింది. కేరళలోనూ ఓడిపోయారు.దీంతో స్పీకర్ పదవి అంటే.. సెంటిమెంటుగా మారిపోయింది. ఇక తాజా విషయానికి వస్తే.. కన్నడ శాసన సభకు 9 సార్లు ఎన్నికైన మాజీ మంత్రి ఆర్వీ దేశ్పాండే ఏడుసార్లు ఎన్నికైన మాజీ మంత్రి టీబీ జయచంద్ర స్పీకర్ పదవిని స్వీకరించడానికి ససేమిరా అన్నారు.దీంతో కాంగ్రెస్ పెద్దలు ఎట్టకేలకు దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన నేత మాజీ మంత్రి యూటీ ఖాదర్ను ఒప్పించారు. అది కూడా రెండున్నరేళ్ల తర్వాత మంత్రి పదవిని ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు.ఒకవేళ వచ్చే ఎన్నికల్లో ఓడిపోతే.. అప్పుడు ఎమ్మెల్సీని చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఎట్టకేలకు ఖాదర్ స్పీకర్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. స్పీకర్ పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో బుధవారం జరిగే ఎన్నికల్లో ఏకగ్రీవం ఖాయమైంది.

# మహానాడుకు టీడీపీ శ్రేణులకు చంద్రబాబు సాదరస్వాగతం..



హైదరాబాద్ మే 25 :27, 28 తేదీల్లో రాజమహేంద్రవరం వేదికగా తలపెట్టిన మహానాడు–2023కు సర్వంసిద్ధమైంది. ఈ మేరకు 'మహానాడు పార్టీ ప్రతినిధుల సభకు ఆహ్వానము' పేరిట పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆహ్వానాలు పంపిస్తున్నారు. తన డిజిటల్ సైన్తో ఉన్న ఆహ్వాన పత్రికలతో పార్టీ కేడర్ను ఆహ్వానిన్తున్నారు. అమరావతి/ రాజమహేంద్రవరం: ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు కదనోత్సాహంతో 'మహానాడు 2023'కు తెలుగుదేశం పార్టీ (సిద్ధమైంది. రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో ఈనెల 27, 28 తేదీల్లో తలపెట్టిన ఈ పసుపు శ్రేణుల పండగకు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. మొదటి రోజున ప్రతినిధుల సభ, రెండో రోజున ఎన్టీఆర్ జయంతి, బహిరంగ సభ జరగనున్నాయి. ఈ మేరకు 'మహానాడు పార్టీ ప్రతినిధుల సభకు ఆహ్వానము' పేరిట పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆహ్వానాలు పంపిస్తున్నారు. తన డిజిటల్ సైన్తో ఉన్న ఆహ్వాన పత్రికలతో పార్టీ కేడర్ను ఆహ్వానిస్తున్నారు.

లేఖలో ఏముందంటే....

" తెలుగుజాతి ఔన్నత్యాన్ని, ఆత్మగౌరవాన్ని యావత్ ప్రపంచానికి చాటిచెప్పిన మన ప్రియతమ నాయకులు, రాష్ట్ర, దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పునకు నాంది పలికిన యుగపురుషుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి శతజయంతి ఉత్సవాలను మహానాడు వేదికగా మరింత ఘనంగా జరుపుకుంటుంది తెలుగుదేశం. అలానే అన్నగారి జయంతి సందర్భంగా ప్రతి యేటా పార్టీ ప్రతినిధుల మహానాడును మే 27న జరుపుకోవడం మన సంప్రదాయం. రాజమహేంద్రవరం (వేమగిరి)లో నిర్వహిస్తున్న మహానాడులో రాజకీయ, సాంఘీక, ఆర్ధిక, ఆరోగ్య, సంస్థాగత అంశాలపై మరియు ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలు, అప్రజాస్వామిక విధానాలపై చర్చ జరుగుతుంది. మే 28న భారీ బహిరంగ సభకు జరుగుతుంది. ఈ మహానాడులో మీరందరూ భాగస్వాములు కావాలని సాదరంగా ఆహ్వానిస్తున్నాను... అభినందనలతో మీ నారా చంద్రబాబు నాయుడు" అని లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు.

ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి....

టీడీపీ మహానాడుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేదికైన వేమగిరి, రాజమహేంద్రవరం ప్రాంతాలో ముస్తాబయ్యాయి. దీంతో ఆ ప్రాంతమంతా ఇప్పటికే పసుపు వర్ణమయ్యింది. మరోవైపు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతమంది వచ్చినా అందుకు తగ్గట్టుగా పార్టీ ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా భోజనాల కోసం పకడ్బంధీ ఏర్పాట్లు చేశారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ మహానాడులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు డీజీపీకి బుధవారం విజ్ఞప్తి చేశారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు లక్షలాదిగా మహానాడుకు రానున్నందున వారికి రవాణా సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ ఎండీని కోరారు. ఈ మేరకు బుధవారం డీజీపీ, ఆర్టీసీ ఎండీలకు వేర్వేరు లేఖలు రాశారు.

## భర్త మరణం తట్టుకోలేక మనస్థాపంతో గృహిణి ఆత్మహత్య

హైదరాబాద్:అంబర్పేట డిడి కాలనీకి చెందిన సాహితి(29) భర్త మనోజ్ యూఎస్ఏ లో హార్ట్ ఎటాక్ తో చనిపోవడంతో మనోవేదనతో సాహితీ ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కి చీరతో ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడింది. సాహితికి సంవత్సరం క్రితమే వనస్థలిపురం కు చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి మనోజ్ తో వివాహం కాగా అప్పటి నుండి వారిద్దరూ అమెరికాలోని డల్లాస్ లో నివసించేవారు. ఈనెల రెండున సాహితీ తన తల్లిదండ్రులను చూడ్డానికి ఇండియాకు రాగా 20వ తేదీన అమెరికాలో భర్త మనోజ్ కు హార్ట్ ఎటాక్ తో హఠాన్మరణం చెందాడు. అమెరికా నుండి 23న వచ్చిన భర్త మనోజ్ మృతదేహానికి బుధవారం వనస్థలిపురంలో అంత్యక్రియలు జరిగిన తర్వాత పుట్టింటికి వచ్చిన సాహితి ముభావంగానే ఉంటూగురువారం ఉదయం తోడుగా ఉన్న చెల్లెలు బయటకు వెళ్లిన పది నిమిషాల్లోనే ఆత్మహత్యకు పాల్పడింది. అంబర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు టీఎస్ పాలిసెట్ -2023 ఫలితాలు విడుదల

హైదరాబాద్ మే 25 : నేడు టీఎస్ పాలిసెట్ –2023 ఫలితాలు విడుదల కానున్నాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఎస్బీటీఈటీ సెక్రటరీ డాక్టర్ సీ శ్రీనాథ్ వెల్లడించనున్నారు.మే 17వ తేదీన పాలీసెట్ 2023 పరీక్ష నిర్వహించారు. పదో తరగతి ఫైనల్ ఎగ్జామ్స్ రాసిన విద్యార్థులు పాలీసెట్ రాశారు. ఈ సెట్లో ఉత్తీర్ణులైనవాళ్లు నేరుగా ఇంజినీరింగ్, నాన్ ? ఇంజినీరింగ్, టెక్నాలజీ సంబంధిత డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందే అవకాశం ఉంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాల్లో చదువుకునే వీలుంది. అగ్రికల్చర్ డిప్లొమా, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ కోర్సులను ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ యూనివర్సిటీలు అందిస్తున్నాయి.మే 17వ తేదీన నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్షకు 92.94 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పాలీసెట్ ప్రవేశ పరీక్షకు 58,520 మంది బాలురు, 47,222 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నారు. 54,700 మంది బాలురు, 43,573 మంది బాలికలు పరీక్షకు హాజరయ్యారు. మొత్తంగా 1,05,742 మంది దరఖాస్తు చేసుకోగా, 98,273 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

## గ్రేటర్ లో వార్డు ఆఫీసుల ఏర్పాటు

హైదరాబాద్: మంత్రి కేటీఆర్ సూచనల మేరకు జిహెచ్ఎంసి వ్యాప్తంగా జూన్ 1వ తేదీ నుండి వార్డు పరిపాలన చేపట్టేందుకు జిహెచ్ఎంసి సన్నాహాలు చేసింది. వార్డు ఆఫీస్ ఏర్పాటు పై వార్డు అడ్మినిస్ట్రేటివ్ అధికారులు డి. సి , జోనల్ కమిషనర్ లతో జి హెచ్ ఎం సి ప్రధాన కార్యాలయం లో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గురువారం ప్రారంభించారు. కమిషనర్ లోకేష్ కుమార్, జలమండలి ఏం డి దానకిషోర్, జి హెచ్ ఎం సి హెచ్ ఓ డి లు తదితరులు ఈ కార్యక్రమానికి హజరయ్యారు. గద్వాల్ విజయ లక్ష్మి మాట్లడుతూ గ్రేటర్ హైదరాబాద్ లో సమస్యల సత్వర పరిష్కారానికి, పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా 150 వార్డు ఆఫీస్ ల ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కో వార్డు ఆఫీస్ లో 10 మంది అధికారుల బృందంతో వార్డు పాలన వ్యవస్థ వుంటుంది. నగర పౌరులకు అతి సమీపంలో వార్డు ఆఫీస్ లను ఏర్పాటు చేసి అందులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, వార్డు ఎంటమాలజిస్ట్, వార్డు ఇంజనీర్, వార్డు టౌన్ ప్లానర్, వార్డు కమ్యునిటీ ఆర్గనైజర్, వార్డు శానిటరీ జవాన్, వార్డు అర్బన్ బయోడైవర్సిటీ సూపర్వైజర్, వార్డు కంప్యూటర్ ఆపరేటర్, వార్డు రిసెప్షనిస్ట్, జలమండలి అధికారులు, టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్ అధికారులు వుంటారు. ఈ నెల 25, 26 తేదీలలో వార్డు ఆఫీస్ లను సకల సదుపాయాలతో సిద్దం చేస్తున్నాం. ఈ నెల 31న వార్డు కార్యాలయాన్ని ప్రారంభించి జూన్ 2వ తేదీ నుండి నగర పౌరులకు వార్డు సేవలను అందించనున్నారు. ఇందులో భాగంగా జిహెచ్ఎంసి "మైజిహెచ్ఎంసి" యాప్ ద్వారా పౌర సమస్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిపి పౌరుల నుండి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడానికి వార్డు ఆఫీస్ లు పనిచేయనున్నాయని అన్నారు..


## గవర్నర్లూ రాష్ట్రపతి మాదిరిగానే రాజకీయేతర వ్యక్తులే కదా!

**తెలంగాణా గవర్నర్ తమిళి సై సంచలన వ్యాఖ్యలు**



చెన్నై మే 25 : నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవ వివాదం సుప్రీంకోర్టుకి చేరింది. కొత్త పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో న్యాయవాది ఇఖజయ సుకిన్ పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్ ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది.ఈ నేపథ్యంలో తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు భవన ప్రారంభోత్సవాన్ని తెలంగాణ నూతన సచివాలయ అంశంతో ముడిపెడుతూ ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆమె చెన్నైలో మాట్లాడారు.తెలంగాణ రాజధాని హైదరాబాద్ లోనూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త సచివాలయాన్ని కట్టిందని.. దాని ప్రారంభోత్సవానికి కనీసం తనకు ఆహ్వానం కూడా అందలేదని తమిళి సై సౌందర రాజన్ గుర్తు చేశారు. కొత్త పార్లమెంటును రాష్ట్రపతి ప్రారంభించాలని విపక్షాలు కోరుతున్నాయని.. అయితే రాష్ట్రపతికి రాజకీయాలతో సంబంధం ఉండదనే అంశాన్ని గుర్తించాలని తమిళి సై కోరారు."తెలంగాణ సచివాలయాన్ని అద్భుతంగా కట్టారు. సచివాలయ ప్రారంభోత్సవానికి కనీసం నన్ను ఆహ్వానించలేదు. నాకు కనీసం ఆహ్వాన పత్రిక కూడా అందించలేదు. కొత్త పార్లమెంటు ప్రారంభోత్సవ అంశం ప్రస్తుతం వివాదాస్పదం అవుతోంది. రాష్ట్రపతే ప్రారంభించాలంటూ ప్రతిపక్షాలు కోరుతున్నాయి. అయితే రాష్ట్రపతికి రాజకీయాలతో సంబంధం లేదని అంటున్నారు. మరి గవర్నర్లూ రాష్ట్రపతి మాదిరిగానే రాజకీయేతర వ్యక్తులే కదా!" అని తమిళి సై వ్యాఖ్యానించారు.మే 28న జరగనున్న కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవంపై వివాదాలు ముసురుకున్న సంగతి తెలిసిందే. ఈ భవనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించనున్నారు. అయితే కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రారంభించే అవకాశం రాష్ట్రపతికి ఇవ్వాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ఇందుకు కేంద్రం నిరాకరించడంతో ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకాబోమని 19 పార్టీలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. మరోవైపు ప్రారంభోత్సవానికి తాము హాజరవుతామని బీజేపీతో సహా దాని మిత్ర పక్షాలు అయిన 14 పార్టీలు ప్రకటనలో తెలిపాయి.ఈ నేపథ్యంలో తమిళి సై వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. తెలంగాణలో గవర్నర్ కు కేసీఆర్ ప్రభుత్వానికి ఉప్పునిప్పులా పరిస్థితి ఉన్న సంగతి తెలిసిందే. గవర్నర్ పర్యటనలకు హెలికాప్టర్ ను ఏర్పాటు చేయకపోవడం శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ఆహ్వానించకపోవడం గవర్నర్ రాష్ట్రంలో ఎక్కడైనా పర్యటిస్తే ప్రొటోకాల్ మర్యాదలను చేయకపోవడం అధికారులెవరూ కూడా ఆమెకు స్వాగతం పలకకపోవడం వంటివి జరుగుతున్న సంగతి తెలిసిందే.

## డింపుల్ పై తప్పుడు కేసు పెట్టారు



హైదరాబాద్:హీరోయిన్ డింపుల్ హయతి, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ కార్ పార్కింగ్ వివాదం పై డింపుల్ తరుపు న్యాయవాది పాల్ సత్యనారాయణ ప్రెస్ మీట్ నిర్వహించారు. డింపుల్ పై తప్పుడు కంప్లెట్ చేసారు. డీసీపీ కార్ కవర్ తీసేసారు..అని ఎఫ్ ఐ ఆర్ లో పెట్టారు. డింపుల్ తొలగించినట్టు ఫుటేజ్ బయట పెట్టండని అయన అన్నారు. డిసిపి రాహుల్ హెగ్డే అబద్దాలు ఆడుతున్నాడు. తన డ్రైవర్ ను కాపాడుకునేందుకు ఇదంతా చేస్తున్నాడు. డ్రైవర్ ఎందుకు బయటకు రావడం లేదని అయన ప్రశ్నించారు. ట్రాఫిక్ ఇన్సపెక్టర్స్, ట్రాఫిక్ పోలీసులు బ్రిక్స్ తీసుకొచ్చి పార్కింగ్ లో పెట్టారు. తప్పును కవర్ చేసేందుకు ఇదంతా చేస్తున్నారు. గవర్నమెంట్ కార్ కు ఎవరు కవర్ పెట్టారు. డీసీపీ బిహేవియర్ బాగాలేక నే డింపుల్ గతం లో వార్నింగ్ ఇచ్చింది. ఇదంతా తట్టుకోలేకనే తప్పుడు కేసు పెట్టారు. డిసిపి కి బాధ్యత తగ్గట్టు పని చేయడం లేదు. ఇదంతా ఫాల్స్ అలిగేషన్స్, ఫ్యాబ్రికేటెడ్ స్టోరీ అని అన్నారు. 41ఏ సెక్షన్ కింద కేసు ఉంది. హీరోయిన్ ఇంట్లో కి ఎవరో తెలియకుండా వ్యక్తులు వస్తున్నారు. బయట కు వెళ్ళడానికి డింపుల్ భయపడుతుంది. వివిధ నంబర్ల నుండి కాల్స్ వస్తునాయి. డిసిపి , డ్రైవర్ పైన న్యాయ పరమైన యాక్షన్ తీసుకుంటాం. డింపుల్ కంప్లైంట్ పెడితే తీసుకోవడం లేదని అయన అన్నారు.

## వినుకొండలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ



హైదరాబాద్ 25 మే ప్రజాపాలన: ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం తెల్లపాడు గ్రామంలో బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరిగింది. పల్నాడు జిల్లా ఇంచార్జ్ మరియు వినుకొండ నియోజకవర్గం మాల మహానాడు అధ్యక్షులు కొమ్మ తోటి పౌలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమం సందర్భంగా విట్టం రాజపల్లి నుంచి బైక్ ర్యాలీ గా తెల్లపల్లి గ్రామానికి చేరుకొని ముఖ్య అతిథిగా హాజరైన మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య. మరియు ఏఎన్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి.చార్వాక్ గారుహాజరై భారత రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ... డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కుల వల్లనే మనం ఈరోజు స్వేచ్ఛగా సమాజంలో బతుకుతున్నాం అని గుర్తు చేశారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అందరూ జీవించాలని మనవి చేశారు. ఈ సందర్భంగా స్థానిక మాల మహానాడు నేతలు చెన్నయ్యను, మన్నే శ్రీధర్, బంగి ఆనంద్ తదితరులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మన్నే శ్రీధర్, బంగి ఆనంద్, వినుకొండ మాల మహానాడు కమిటీ, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 'మహానాడు'ను విజయవంతం చేయాలి

**నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు.**




పల్నాడు జిల్లా. నరసరావుపేట .మే 25. (ప్రజాపాలన ప్రతినిధి.): ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఈనెల 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరం దగ్గర వేమగిరిలో నిర్వహించనున్న మహానాడు-2023కు నరసరావుపేట నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు,కార్యకర్తలు,ఎన్టీఆర్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు.రొంపిచర్ల మండలం కర్లకుంట గ్రామంలో రచ్చబండ కార్యక్రమంలో డా.చదలవాడ పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు గ్రామ టీడీపీ నాయకులు,కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా డా.చదలవాడ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే మహానాడులో 27న జరిగే సభలో 25వేల మంది పార్టీ ప్రతినిధులు, 28న జరిగే బహిరంగ సభకు ప్రజలు లక్షలాదిగా హాజరు కానున్నారని,ఇప్పటికే ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు.నియోజకవర్గం నుంచి అంచనాలను మించి ప్రజలు హాజరయ్యే విధంగా ప్రతి నాయకుడు,కార్యకర్త చర్యలు చేపట్టాలన్నారు.వైసీపీ పాలనలో ఏ ఒక్క వర్గానికి మేలు చేకూరలేదని,ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సద్ధంగా ఉండాలని డా.చదలవాడ అన్నారు.నాలుగేళ్లలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని,అవినీతి పేరుకుపోయిందని,జగన్‌రెడ్డి బటన్‌లు నొక్కినా లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్ములు చేరడం లేదని పేర్కొన్నారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు ఎప్పటిప్పుడు వివరించే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలన్నారు.రాష్ట్ర భవిష్యత్,భావితరాలను కాపాడగలిగేది చంద్రబాబు నాయకత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లవల్లి పరిశ్రమ వాడలో భూములు కోల్పోయిన రైతులకు మద్దతుగా జనసైనికులు




బాపులపాడు, మే 25, ప్రజాపాలన ప్రతినిధి: బాపులపాడు మండలంలోని మల్లవల్లి పరిశ్రమ వాడలో భూములు కోల్పోయిన రైతులకు మద్దతుగా ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాతపూర్వక హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదనీ భీష్మించుకుని కూర్చున్నారు. నూజివీడు, ఆగిరిపల్లి, బాపులపాడు, పెదపాడు, దెందులూరు, విజయవాడ ప్రాంతాల్లోని 124 మంది రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ మల్లవల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో వద్ద మండుటెండలో రైతులకు మద్దతుగా జనసేన నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బండ్రెడ్డి రవి, జిల్లా సంయుక్త కార్యదర్శి చిమట రవి వర్మ, నూజివీడు, చాట్రాయి, బాపులపాడు మండలాల అధ్యక్షులు యరంసెట్టి రాము, ఆరేపల్లి కృష్ణ, వడ్డే శివ నాగేశ్వరావు, నూజివీడు టౌన్ నాయకులు మమ్మలనేని సునీల్ కుమార్, రైతు నాయకులు దొనవల్లి వెంకట్రావు, మహిళ రైతులు పాల్గొన్నారు.

## జిల్లాలో 60 గ్రామాల్లో చేపట్టిన రెండో దశ రీ సర్వే కార్యక్రమం వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు



మచిలీపట్నం కలెక్టరేట్ మే 25 ప్రజాపాలన :జిల్లాలో 60 గ్రామాల్లో చేపట్టిన రెండో దశ రీ సర్వే కార్యక్రమం వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు.గురువారం మధ్యాహ్నం మంగళగిరి నుండి భూపరిపాలన ముఖ్య కమిషనర్ జిల్లా కలెక్టర్లతోవీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రీ సర్వే కార్యక్రమం, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లోని వారి చాంబర్ నుండి సంయుక్త కలెక్టర్అపరాజిత సింగ్, సర్వే భూ రికార్డుల ఏడి గోపాల్ రాజా తో కలిసి పాల్గొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండవ దశ రీ సర్వే కార్యక్రమం 13 మండలాల్లోని 60గ్రామాలలో చేపట్టగా అందులో ఇప్పటివరకు 52 గ్రామాల్లోని 95,972 ఎకరాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులుపూర్తి అయ్యాయన్నారు. ఇంకా8 గ్రామాల్లో 8,494 ఎకరాల్లో జరగాల్సి ఉందన్నారు.అలాగే 34 గ్రామాల్లోని 59,511 ఎకరాల్లో గ్రౌండ్ వ్యాలిడేషన్ పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లోపురోగతిలో ఉందన్నారు.డిఎస్ఆర్ పనులు 14 గ్రామాల్లో పూర్తికాగా 20 గ్రామాల్లో పురోగతిలో ఉందన్నారు.గ్రామ సర్వేయర్ ఒక ఓఆర్ఎస్ఐ తీసుకుని విఆర్ఓ తో కలిసి గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలిడేషన్ కలిపిఒకేసారి రీ సర్వే పూర్తి చేయాలన్నారు. తదుపరి భూ హక్కుదారులకు 9(2) నోటీసులను జారీ చేసి వారిఆమోదం తీసుకొని నిర్ణీత కాలంలో డేటా ఎంట్రీలు గ్రామ సర్వే లాగిన్ లో నమోదు చేయాలన్నారు.అనంతరం విఆర్ఓ, తహసిల్దార్, ఆర్డీవో లాగిన్ లో నుంచి ఆ వివరాలు సంయుక్త కలెక్టర్ లాగిన్ కుపంపాలన్నారు.తాజా డి ఎల్ ఆర్ నిబంధనల ప్రకారం అన్ని రకాల సవరణలు, మార్పులు గ్రామ సర్వేయర్ లాగిన్‌లోనే చేయాలన్నారు. లేదంటే ఆ తదుపరి సంయుక్త కలెక్టర్ లాగిన్ లో చేయవలసి ఉంటుందన్నారు.డిఎల్ఆర్ తయారయ్యాక తహసిల్దార్ కు అక్కడి నుంచి ఆర్డిఓ ద్వారా సంయుక్త కలెక్టర్ కుపంపాలన్నారు.రీ సర్వే పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా చేయాలని ఇందులో పూర్తి బాధ్యత గ్రామసర్వేయర్లు, వీఆర్వోలదేనని స్పష్టం చేశారు.జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వచ్చిన అర్జీలనుక్షుణ్ణంగా అధ్యయనం చేసి సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా మరల వస్తున్న అర్జీల పట్ల,అసంతృప్తితో ఉన్న అర్జీదారుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్జీదారుల్లో అసంతృప్తి తగ్గించేందుకుకృషి చేయాలన్నారు.ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించి ఆర్ ఓ ఆర్, భూముల కబ్జా, భూముల ఆక్రమణ వంటి అంశాలపట్ల తక్షణమే స్పందించి బాధితులను ఆదుకోవాల్సి ఉంటుందన్నారు.అసైన్మెంట్ కమిటీల ద్వారా పేదలకు పట్టా భూములు పంపిణీ కోసం వెంటనే చర్యలుచేపట్టాలన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి సారధులు వాలంటీర్లు ఎమ్మెల్యే కొలుసు పార్ధసారథి కితాబు



పెనమలూరు, ప్రజా పాలన ప్రతినిధి, మే 25 : రాష్ట్ర అభివృద్ధికి వారదులుగా వాలంటీర్లు సేవలందిస్తున్నారని పెనమలూరు శాసనసభ్యులు కొలుసు పార్ధసారథి కితాబిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వాలంటీర్లకు వందనం కార్యక్రమం ఉయ్యూరు పట్టణంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు కొలుసు పార్ధసారథి మాట్లాడుతూ దేశంలోనే 30 లక్షల మంది పేదలకు ఇల్లు ఇచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి చెందుతుందన్నారు .రాష్ట్ర దశ దిశను మార్చి అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ అభివృద్ధిలో ప్రధాన వారదులుగా సారధులుగా వాలంటీర్లు నిలుస్తున్నారని వారికి ప్రతి ఒక్కరు వందనం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు .రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధిలో వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని వారి సేవలు అభినందనీయమన్నారు దీనిలో భాగంగానే వాలంటీర్ల సేవలను గుర్తించిన ప్రభుత్వం విస్తృత సేవలు విలువైన సేవలు అందించిన వాలంటీర్లను గుర్తించి సముచిత స్థానాన్ని ఇస్తూ ఘనంగా సన్మానిస్తున్నామని వివరించారు .ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు వలంటీర్ల సేవలను గుర్తించక పోగా అవాకుల చావాకుల పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రానున్న కాలంలో వారికి వాలంటీర్లతో పాటు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు అనుచిత వ్యాఖ్యలు విరమించుకోవాలని లేకుంటే రానున్న కాలంలో తగిన మూల్యం తప్పదన్నారు. అనంతరం ఉయ్యూరు తో పాటు మండలంలోని 11 గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న వాలంటీర్లను పేరుపేరునా ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో ఉయ్యూరు నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ నాని ఉయ్యూరు మండల పరిషత్ అధ్యక్షురాలు చీలి కల్పన, గండిగుంట సర్పంచ్ గెత్తం అనుపమ, పెదబాబు సర్పంచ్ త్రిపురం లక్ష్మి, కలవపాముల గ్రామ సర్పంచ్ పోనుగుమాటి బాలస్వామి, ఉయ్యూరు మార్కెట్ యార్డ్ కమిటీ వైస్ చైర్మన్ దాసే, ఉయ్యూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్ సోలె సురేష్ బాబు, నగర పంచాయతీ ఒకటో వార్డు కౌన్సిలర్ గుంజా సుధాకర్, ఉయ్యూరు నగర కమిషనర్ పాయసం వెంకటేశ్వరావు, తాసిల్దార్ మస్తాన్ రావు, ఎంపీడీవో ఉమాదేవి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తో పాటు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది వాలంటీర్లు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పేద వాడు బాగుపడితే ఓర్వ లేనితత్వం చంద్రబాబుది

**నరసరావుపేట శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మే 25 ( ప్రజాపాలన ప్రతినిధి ) పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మరియు ఏపీ అగ్రికల్చర్ మిషన్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ సామాన్య ప్రజల అభీష్టం మేరకు ఏర్పడిన ప్రభుత్వం మా జగనన్న ప్రభుత్వం, ఇచ్చిన మాట ప్రకారం ఫిషింగ్ హార్బర్, మచిలీపట్నం, బందరు పోర్టుల నిర్మాణం వేగవంతం, మెడికల్ కళాశాల కూడా త్వరలోనే పూర్తి చేస్తాం.నామమాత్రపు అభివృద్ధికి నిదర్శనం తెలుగుదేశం.కరోనా సమయంలో పేద ప్రజల సంరక్షణ కోసం అహర్నిశలు శ్రమించి ఏకైక ముఖ్యమంత్రి మన జగన్ మోహన రెడ్డి అని అన్నారు.మళ్ళీ ఎన్నికలో వైసీపీ పార్టీ విజయం ఖాయం అని అన్నారు.కేవలం ఒక నెలకు 1800 కోట్ల రూపాయలు నిధులు పెన్షన్ కోసం ఖర్చు పెడుతున్నాం పేద వాడి సొంత ఇంటి కలను నిజం చేసిన నాయకుడు జగన్ మోహన్ రెడ్డి . డ్వాక్రా రుణమాఫీ రైతు రుణమాఫీతో చంద్రబాబు ప్రజలను మోసం చేశాడని అన్నారు ప్రజలకు చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు రాష్ట్రంలో ప్రజల సుఖసంతోషాలతో ఉన్నారని అన్నారు జగనన్న కాలనీలో 30 లక్షల పట్టాలను మంజూరు చేసి ఇల్లు నిర్మిస్తున్నామని ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ఇల్లు నిర్మాణం చేపడుతున్నామని విశాలమైన 3 అడుగుల రోడ్లు ఇచ్చి పేద ప్రజలను ఆదుకుంటున్నామని అన్నారు పేద ప్రజలు అంటే చంద్రబాబు గిట్టదని డబ్బున్న వారికే విలువనిస్తాడని అన్నారు లక్షాధికారుల నివాసాలు ఉండాలని ఉద్దేశంతో పేదలకు ఇచ్చే పట్టాలను సైతం కోర్టుకు వెళ్లి ఆ దిన ఘనత చంద్రబాబుకే దక్కిందని అన్నారు పేదవానికి అండగా ఉండే ప్రభుత్వం జగన్ ప్రభుత్వం అని అన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ ఏ. అనీఫ్ మాజీ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

## అంతర్జాతీయ కరాటే పోటీల్లో నూజివీడు విద్యార్థుల ప్రతిభ




నూజివీడు, మే 25, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు చైతన్య విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఈనెల 14 నుండి 16వ తేదీ వరకు నేపాల్ లో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ కనపరిచి బంగారు పథకాలు సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపరిచి బంగారు పతకాలు సాధించిన ఆదర్శ బాబు, శివ శ్రీకర్, శివ అభిషేక్ అనే విద్యార్థులను గురువారం పట్టణ పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి అభినందించారు. ఈ సందర్భంగా సిఐ మూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే వివిధ రకాలైన క్రీడాల పట్ల ఆసక్తి చూపుతూ ప్రతిభ కనపరచాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించి, విద్యాసంస్థలలో తగిన శిక్షణ అందించాలన్నారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు నేటి విద్యార్థి లోకానికి ఆదర్శనీయమన్నారు. చైతన్య విద్యాసంస్థల ఏజీఎం మురళీకృష్ణ, ఆరై నరేంద్ర, ప్రిన్సిపల్ రామ్మోహన్ ఆచారి లు గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించి అన్నివేళలా ప్రోత్సహిస్తామన్నారు.

## నూజివీడులో పారిశుధ్యం పై సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



నూజివీడు, మే 25, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు పట్టణం ధర్మ అప్పారావు కళాశాల వద్ద, అదే రోడ్డులో రైతు బజారు సమీపంలో చెత్తాచెదారం డ్రైనేజీలను తక్షణమే పరిశుభ్రం చేయాలని సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్ర అధికారులను ఆదేశించారు. పట్టణంలోని రోడ్లను గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. డ్రైనేజీ దాటి దుకాణం దారులు ఆక్రమిస్తే చర్యలు తప్పమన్నారు. పూడుకుపోయిన డ్రైనేజీలను పరిశుభ్రం చేయాలన్నారు. స్వచ్ఛ పట్టణం కోసం అందరం నడుం బిగించాలని సూచించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ డ్రైనేజీల శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేయవలసిన అవసరం ఉందని అన్నారు. అందుకు స్పందించిన సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర మాట్లాడుతూ పరిశుభ్రత, ప్రజారోగ్యం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఉన్నతాధికారులకు దీని పరిష్కారానికి నివేదికలు పంపిస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


## ప్రభుత్వ పథకాలపట్ల ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలి-కలెక్టర్

మచిలీపట్నం మే 25 ప్రజాపాలన :జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ ఏఏ అంశాల్లో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారోవిశ్లేషించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు జిల్లా అధికారులకు సూచించారు. ప్రభుత్వపథకాల పట్ల ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగేలా పటిష్టవంతంగా అమలు చేయలన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డి గురువారం జిల్లాకలెక్టర్లతో అమరావతి సచివాలయం నుండి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి విద్య,వైద్యం, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుండివీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ జిల్లా ప్రగతి వివరించారు.జగనన్నకు చెబుదాం కార్యక్రమం క్రింద 1902 కాల్ సెంటర్ల వచ్చిన గ్రీవెన్సుకుసంబంధించి జిల్లాకు చెందినవి 582 గ్రీవెన్సు రాగా వాటిలో 296 గ్రీవెన్సు పరిష్కరించగా,మిగత గ్రీవెన్సులు పరిష్కరించుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చినగ్రీవెన్సులో ఎక్కువగా వివిధ పథకాల క్రింద చెల్లింపులు ఆలస్యం కావడం, వరకట్నంవేధింపులు, పోలీసులపై ఫిర్యాదులు, మోసాలు వంటి సమస్యలపై ఎక్కువగా వస్తున్నట్లుసిఎస్కు వివరించారు. యే యే అంశాల్లో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారో విశ్లేసించాలనికలెక్టర్ జిల్లా అధికారులకు సూచించారు. రీ ఓపెన్ అర్జీలు ఎందుకు వస్తున్నాయి,తీసుకున్న చర్యలు నివేదించాలన్నారు.జిల్లా జనాభా 16.95 లక్షలు కాగా నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ సంబంధించి 78శాతం సర్వే పూర్తి అయిందని, సర్వే పూర్తి అయిన వారికి హెల్త్ ఐడిలు జనరేట్ చేయడంజరిగిందన్నారు.ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుకు సంబంధించి జిల్లాలో గ్రామాల్లో వైద్య సేవలు అందించే క్రమంలో హైపర్ టెన్షన్, డయాబేటిక్, ఈ రెండు ఉన్న వారిని గుర్తించి వారికితగిన వైద్యం అందించుటకు మే నెల లక్ష్య సాధనకు సంబంధించి 39,216 మందిహైపర్ టెన్షన్ గల వారికి వైద్య పరీక్షలు చేసే లక్ష్యంతో 35,175 మందికి వైద్య పరీక్షలునిర్వహించినట్లు తెలిపారు. 26,518 మంది డయాబేటిక్ గల వారికి వైద్య పరీక్షలునిర్వహించే లక్ష్యంతో 23,159 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు విసిలో కలెక్టర్ తెలిపారు.వైయస్ఆర్ కంటి వెలుగు పథకం క్రింద 60 సం. దాటిన అవ్వా తాతలకు కంటిపరీక్షలు నిర్వహణకు సంబంధించి జిల్లాలో గుర్తించిన 2,12,697 మందికి కంటి పరీక్షలుచేయాలనే లక్ష్యంతో ఇప్పటిదాకా 1,28,695 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లుతెలిపారు. వీరిలో కంటి అద్దాలు అవసరమైన 43,047 మందికి గాను 34,914 మందికికంటి అద్దాలు అందజేసినట్లు తెలిపారు. కంటి శుక్లాలు శస్త్రచికిత్సలు అవసరమైన 9,653మందిలో 50 శాతం వరకు శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు సిఎస్కు తెలిపారు.



## "హిడింబ" కోసం సుప్రీమ్ హీరో.!

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అశ్విన్ బాబు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ భారీ యాక్షన్ చిత్రం "హిడింబ". దర్శకుడు అనీల్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నందిత శ్వేతా అయితే హీరోయిన్ గా నటిస్తుంది. మరి ఈ సినిమా కోసం అశ్విన్ బాబు మాస్ మేకోవర్ లోకి మారగా ఇప్పటివరకు వచ్చిన పలు పోస్టర్ లు గ్లింప్స్ లు మంచి హైప్ అయితే రేపాయి. ఇక ఇపుడు మేకర్స్ ఫైనల్ గా అయితే ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ ని రిలీజ్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. మరి ఈ సినిమా ట్రైలర్ ని రీసెంట్ గా "విరూపాక్ష" తో సెన్సేషనల్ హిట్ అందుకున్న మెగా సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ చేత రిలీజ్ చేయించడానికి మేకర్స్ ఫిక్స్ చేశారు. మరి ఈ ట్రైలర్ ని అయితే రేపు ఈ మే 26 న ఆర్ కె సినీప్లెక్స్ స్క్రీన్ 1 లో అయితే సాయంత్రం 7 గంటల 2 నిమిషాలకి లాంచ్ చేయనున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. మరి ఈ మాస్ థ్రిల్లర్ ట్రైలర్ ఎలా ఉంటుందో చూడాలి.




## ఆదిపురుష్ సెంకడ్ సింగిల్.. ఐడియా అదిరింది..!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం ఆదిపురుష్. ఈ సినిమాలో ప్రభాస్ రామ్నుడుగా కనిపించనున్నాడు. ఈ సినిమా కోసం ప్రభాస్ ఫ్యాన్స్ ఎంతో కాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎప్పుడెప్పుడు తమ హీరోని తెరపై చూద్దామా అని ఆశపడుతున్నారు. సినిమా విడుదలయ్యేలోపు ఫ్యాన్స్ ని సంతోష పెట్టడానికి ట్రైలర్పాటలు విడుదల చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ ఆకట్టుకుంది. ఆ తర్వాత ప్రముఖ లిరిసిస్ట్ రామ జోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన 'జై శ్రీరామ్ జై శ్రీరామ్ రాజా రామ్' పాట కూడా సంగీత ప్రియులను ఆకట్టుకుంది త్వరోలనే ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ విడుదల



చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. అయితే ఈ రెండో పాట విడుదల కోసం మంచి ప్లాన్ రెడీ చేశారు. ఆ ప్లాన్ వర్కౌట్ అయితే మూవీకన్నా ముందు పాటే హైలెట్ అయ్యే అవకాశం ఉంది. ఇంతకీ ఏం చేస్తున్నారంటే దేశ వ్యాప్తంగా ఉన్న 70కి పైగా రేడియో స్టేషన్లు జాతీయ న్యూస్ ఛానెళ్లు అవుట్డోర్ యూట్యూబ్ మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్ఫారమ్ సోషల్ మీడియా ప్లాట్ఫారమ్లు టిక్కెట్ బుకింగ్ ప్లాట్ఫారమ్లు సినిమా ఛానెళ్లతో పాటు మూవీ థియేటర్లతో ఈ పాటను ప్రదర్శించేందుకు మేకర్స్ ప్లాన్ చేశారు. ప్రేక్షకుల్లోకి చాలా తొందరగా పాట తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ఇలా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. కాగా ఈ పాట 'రామ్ సియా రామ్' అంటూ సాగతుందట. మే 29 మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేస్తున్నారు.

ఇంత భారీ మొత్తంలో ప్లాన్ చేసి మరీ విడుదల చేస్తున్న ఈ పాట ఎంత వరకు ఆకట్టకుంటుందో చూడాలి. ఇక ఈ పాట హిందీ తెలుగు తమిళం కన్నడ మలయాళ భాషల్లో విడుదల కానుందిఇదిలా ఉండగా ఆదిపురుష్ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. మొదట మూవీ టీజర్ చూసినప్పుడు విమర్శలు ఎదురైనా ఆ తర్వాత ట్రైలర్ చూసి అందరూ షాకయ్యారు. అందరినీ విపరీతంగా ఆకట్టకుంటుంది. మూవీలో మ్యూజిక్ పాటలు సినిమాకి ప్రధాన ఆకర్షణ అవుతాయని చిత్ర బృందం నమ్ముతోంది. ఇందులో ప్రభాస్ రాముడు కాగా సీతగా కృతిసనన్ రావణాసురుడిగా సైఫ్ అలీఖాన్ నటిస్తున్నారు.

## "విరూపాక్ష" లో ఆ మార్పు చేసింది సుకుమారే: డైరెక్టర్ కార్తీక్ దండు!



టాలీవుడ్ యంగ్ హీరో సాయి ధరమ్ తేజ్, హీరోయిన్ సంయుక్త మీనన్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ థ్రిల్లర్ విరూపాక్ష. ఈ చిత్రం థియేటర్లలో విడుదల అయ్యి ప్రేక్షకులను, అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. బాక్సాఫీస్ వద్ద సాలిడ్ వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం. తాజాగా ఈ చిత్రం కి సంబంధించిన మెయిన్ ఎలిమెంట్ విషయం లో డైరెక్టర్ కార్తీక్ దండు కీలక వ్యాఖ్యలు చేశారు. తను రాసుకున్న కథ ప్రకారం, యాంకర్ శ్యామల (పార్వతి) నెగటివ్ పాత్ర చేయాల్సి ఉంది. అయితే స్క్రీన్ ప్లే ను మార్చి, చివరకు సంయుక్త మీనన్ ను విలన్ గా చేసింది సుకుమార్ అంటూ చెప్పుకొచ్చారు. డైరెక్టర్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ లు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్ నాథ్ సంగీతం అందించగా, సునీల్, బ్రహ్మాజీ, రాజీవ్ కనకాల, అజయ్, రవి కృష్ణ లు కీలక పాత్రల్లో నటించారు.

## అర్ధరాత్రి నడిరోడ్డుపై కొరటాల అనిరుద్!

జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో దేవరా సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో హై వోల్టేజ్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుంది. సైఫ్ అలీ ఖాన్ ప్రతి నాయకుడి పాత్రలో కనిపించబోతున్నారు. స్టార్ కాస్టింగ్ తోనే ఈ చిత్రాన్ని కొరటాల శివ సిల్వర్ స్క్రీన్ పై ఆవిష్కరిస్తున్నారు. రీసెంట్ గా జూనియర్ ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ ను ఆవిష్కరించి సినిమాపై ఎక్స్పెక్టేషన్స్ అమాంతం పెంచేశారు. ఇదిలా ఉంటే కోలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుద్ ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీకి సంబంధించిన సాంగ్స్ సిట్టింగ్స్ జరిగినట్లు టాక్ వినిపిస్తోంది. తాజా గా కొరటాల శివ అనిరుద్ కి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు ఎన్టీఆర్ ఫ్యాన్స్ క్లబ్ ట్విట్టర్ ప్రొఫైల్ ద్వారా సర్క్యులేట్ అవుతుంది. ఉదయం రెండు గంటల సమయంలో కొరటాల శివ అనిరుద్ జూనియర్ ఎన్టీఆర్ ఇంటి ముందు కారు పక్కన నిలబడి ఏదో పిచ్చా పార్టీ చర్చించుకుంటూ ఉన్నారు. ఎవరో ఈ వీడియోని క్యాప్చర్ చేసి సోషల్ మీడియాలో పెట్టారు. ఇప్పుడు ఆ వీడియో కాస్త వైరల్ అవుతుంది. ఏకంగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ క్లబ్ ట్విట్టర్ ప్రొఫైల్ ద్వారానే ఈ వీడియో సోషల్ మీడియాలో షేర్ కావడం విశేషం. జూనియర్ ఎన్టీఆర్ తో దేవరా సినిమాకి సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్ లో భాగంగా అనిరుద్ కొరటాల శివ ఆ సమయంలో తారక్ ఇంటి ముందు ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తున్న మాట. ఈ మూవీ కోసం పెట్టిన దేవరా టైటిల్ అయితే సినిమాపై అంచనాలు పెంచే విధంగానే ఉంది. మరి దానికి తగ్గట్లుగా సాంగ్స్ బ్యాగ్రౌండ్ మ్యూజిక్ ఏ మేరకు అనిరుద్ అందించి ప్రేక్షకులని మెప్పిస్తారు అనేది వేచి చూడాలి. తమిళంలో మోస్ట్ సక్సెస్ ఫుల్ మ్యూజిక్ డైరెక్టర్ గా ఉన్న అనిరుద్ తెలుగులో చేసిన రెండు సినిమాలు పెద్దగా హిట్ కాలేదు. అయితే ఈ మూవీపైన మాత్రం గట్టిగా ఎఫెర్ట్ పెట్టి వర్క్ చేస్తున్నారనే మాట వినిపిస్తోంది.





## నందమూరి ఫ్యామిలీ నుండి కొత్త హీరోతో 'ఎన్టీఆర్' బయోపిక్

దగ్గుబాటి అభిరామ్ ను హీరోగా పరిచయం చేస్తూ దర్శకుడు తేజ రూపొందించిన 'అహింస' సినిమా విడుదలకు సిద్ధం అయ్యింది. వచ్చే వారంలో విడుదల అవ్వబోతున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా తేజ ఇటీవల పలు మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ వస్తున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తేజ మాట్లాడుతూ తాను గతంలో ఎన్టీఆర్ బయోపిక్ ను చేసే అవకాశం దక్కగా వదిలేసుకున్నందుకు ఫీల్ అవుతున్నట్లుగా పేర్కొన్నాడు. అంతే కాకుండా ఎన్టీఆర్ వంటి గొప్ప వ్యక్తి జీవితాన్ని కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు తన పద్దతిలో తీసుకు వస్తాను




అంటూ మరోసారి గట్టిగా చెప్పాడు. అయిదు సంవత్సరాల క్రితం బాలకృష్ణ హీరోగా తేజ దర్శకత్వంలో 'ఎన్టీఆర్' బయోపిక్ కు సంబంధించిన ప్రకటన వచ్చింది. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా క్యాన్సిల్ అయ్యింది. ఆ విషయమై తేజ మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు 70 సినిమాలను ఏదో కారణంగా తిరస్కరిస్తూ వచ్చాను. బాలయ్య తో సినిమా క్యాన్సల్ అవ్వడంపై పెద్దగా బాధ లేదు కానీ ఎన్టీఆర్ బయోపిక్ వదు లుకోవడం బాధను కలిగించింది. అప్పుడు మిస్ అయిన ఎన్టీఆర్ బయోపిక్ ను తాను భవిష్యత్తులో తీస్తానంటూ పేర్కొన్నాడు. సినిమా రూపంలో కాకుండా సిరీస్ రూపంలో బయోపిక్ ను తీసుకు వస్తానంటూ ప్రకటించారు. తాను తీయాలనుకుంటున్న సిరీస్ లో ఎన్టీఆర్ పాత్ర కోసం నందమూరి హరికృష్ణ మనవడు అయిన ఎన్టీఆర్ ని నటింపజేయాలని భావిస్తున్న ట్లుగా చెప్పుకొచ్చాడు. హరికృష్ణ మనవడి పేరు కూడా ఎన్టీఆర్. అత డిని ఎన్టీఆర్ బయోపిక్ తో నటుడిగా పరిచయం చేయాలని తేజ ప్రయ త్నాలు చేస్తున్నాడట. అది ఎంతవరకు సాధ్యం అవ్వబోతుంది అనేది చూడాలి.

## ప్రొడ్యూసర్ గా చరణ్ మరో ఇంట్రెస్టింగ్ స్టెప్.!



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం మావెరిక్ దర్శకుడు శంకర్ తో "గేమ్ చేంజర్" అనే పాన్ ఇండియా సినిమా చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. మరి ఇలా సినిమాలతో పాటుగా చరణ్ ప్రొడ్యూసర్ గా కూడా తన బ్యానర్ కొణిదెల ప్రొడక్షన్ నుంచి పలు భారీ చిత్రాలు తాను నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే. మరి చరణ్ అయితే ఇప్పుడు నిర్మాత గా చరణ్ ఇంట్రెస్టింగ్ స్టెప్ తీసుకున్నట్టుగా తెలుస్తోంది. చరణ్ అయితే యూవీ క్రియేషన్స్ ప్రొడ్యూసర్ విక్రమ్ రెడ్డి తో టై అప్ అయ్యి ఓ కొత్త ప్రొడక్షన్ హౌస్ ని స్టార్ట్ చేయనున్నారట. మరి ఈ ప్రొడక్షన్ హౌస్ నుంచి మెయిన్ గా యంగ్ టాలెంట్ నుంచి అయితే సరికొత్త సినిమాలు నిర్మాణం వహించనున్నట్టుగా తెలుస్తోంది. అలాగే కంటెంట్ బట్టి పలు భారీ చిత్రాలు కూడా వస్తాయని తెలుస్తోంది. మరి ఈ సరికొత్త ప్రొడక్షన్ హౌస్ పై మరిన్ని డీటెయిల్స్ రావాల్సి ఉంది.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989